# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 2-5-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:26 సంచిక: 240 పేజీలు:4 వెల: రూ.1/-


## కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపిన సీఎం, గవర్నర్

హైదరాబాద్, మే1: కార్మికులకు గవర్నర్ తమిళిసై సౌదర రాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్ మేడే శుభాకాంక్షలు తెలిపారు. దేశనిర్మాణంలో కార్మికుల శ్రమను గుర్తించిన రోజు మేడే. శ్రామికుల కష్టాన్ని గుర్తించి గౌరవిద్దాం. కార్మికులంతా ఆరోగ్యం, సంపదతో బాగుండాలని ప్రార్థిస్తున్నా. లాక్‌డౌన్ మార్గదర్శకాలు పాటించి కరోనాపై విజయం సాధించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. జాతి నిర్మాణంలో, నాగరికత వికాసంలో కార్మికుల చెమట, రక్తం ఉన్నాయి. యావత్ సమాజం కార్మికవర్గానికి అండగా నిలవాల్సిన తరుణమిదని సీఎం కేసీఆర్ కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. కరోనా కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటున్న కార్మికులకు వందనం, వారందరికీ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు అని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. కార్మికుల శ్రేయస్సుకు సీఎం అన్ని చర్యలు తీసుకుంటున్నారు. విపత్తు నుంచి బయటపడ్డాక బంగారు తెలంగాణాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# కొత్త జోన్లను ప్రకటించిన కేంద్ర ఆరోగ్యశాఖ

### తెలంగాణలో ఆరు రెడ్‌జోన్ల గుర్తింపు
### ఎపిలోరెడ్‌జోన్ల పరిధిలోకి ఐదు జిల్లాలు
### కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతి సూడాన్ వెల్లడి

న్యూఢిల్లీ,మే1(ఆర్ఎన్ఎ): కేంద్ర ఆరోగ్యశాఖ కరోనా జోన్లపై కొత్త జాబితాను రిలీజ్ చేసింది. దేశంలో కరోనా వైరస్ కేసులు ఉన్న ప్రాంతాలను మూడు జోన్లుగా ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం రెడ్, ఆరెంజ్, గ్రీన జోన్ల వివరాలను వెల్లడించింది. కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి ప్రీతి సూడాన్ ఈ వివరాలను తెలిపారు. ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆమె దీనికి సంబంధించి లేఖలు రాశారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న జిల్లాలను రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లుగా ప్రకటిస్తూ జాబితాను రిలీజ్ చేశారు. రికవరీ రేటు పెరిగిన తర్వాత కొత్తగా ఈ జోన్ల జాబితాను తయారు చేశారు. తాజా జాబితా ప్రకారం 130 జిల్లాలు రెడ్ జోన్‌లో, 284 ఆరెంజ్ జోన్, 319 గ్రీన్‌జోన్‌లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా వైరస్ సోకిన వారి సంఖ్య 35 వేలు దాటింది. మరణించిన వారి సంఖ్య 1147గా ఉన్నది. తెలంగాణలో ఆరు రెడ్ జోన్లు, 18 ఆరెంజ్ జోన్లు, 9 గ్రీన్ జోన్లు ఉన్నాయి. ఇకపోతే ఎపిలో 13 జిల్లాల్లో ఐదు రెడ్‌జోన్లు,ఏడు ఆరెంజ్ జోన్లు, ఒకటి గ్రీన్‌జోన్‌గా ప్రకటించారు. దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ ఆంక్షలపై సడలింపులు ఉంటాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరోసారి కరోనా ప్రభావిత ప్రాంతాలను గుర్తించింది. రాష్ట్రాల వారిగా ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకుని రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లను నోటిఫై చేసింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జాబితాలో తెలంగాణలోని ఆరు జిల్లాలు రెడ్ జోన్లుగా గుర్తించింది. అలాగే దేశంలో రెండు వారాల క్రితం సుమారు 170 హాట్‌స్పాట్ జిల్లాలను ప్రస్తుతం 129కి తగ్గించింది. తెలంగాణలోని రెడ్ జోన్లుగా హైదరాబాద్, సూర్యాపేట,రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికరాబాద్ వరంగల్ అర్బన్ జిల్లాలు ఉన్నాయి. మరోవైపు కరోనా తీవ్రతను బట్టి దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలను ఆరెంజ్ జోన్లుగా వర్గీకరించింది. తీవ్రత తక్కువగా ఉన్న జిల్లాలకు ఈ జాబితాలో చేర్చింది. ఈ క్రమంలోనే రెండు వారాల కింద ఆరెంజ్ జోన్లు సంఖ్య 207గా ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 297కు పెరిగింది. అదే విధంగా తెలంగాణలో ఆరెంజ్ జోన్ల సంఖ్య పెరిగింది. రాష్ట్రంలోని 18 జిల్లాలను ఆరెంజ్ జోన్లుకు గుర్తించింది ఆరెంజ్ జోన్లు జాబితాలో నిజామాబాద్,జోగులాంబ గద్వాల, నిర్మల్, నల్గొండ, ఆదిలాబాద్ రంగారెడ్డి, కామారెడ్డి, ఆసిఫాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ ్నగర్, జగిత్యాల,రాజన్న సిరిసిల్ల,మెదక్, భూపా లపల్లి,జనగామ, నారాయణ్‌పేట, మంచిర్యాల ఉన్నాయి. తెలంగాణలో గ్రీన్ జోన్లుగా పెద్దపల్లి,నాగర్ కర్నూల్, ములుగు ,భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్దిపేట,వరంగల్ రూరల్, వనపర్తి యాదాద్రి భువనగిరి ఉన్నాయి. రెడ్ జోన్‌లో లాక్‌డౌన్ ఆంక్షలు కఠినంగా ఉంటాయి. ఎపిలో కర్నూలు,గుంటూరు,చిత్తూరు, కృష్ణా, నెల్లూరు జిల్లాలో రెడ్ జోన్ల పరిధిలో ఉన్నాయి. ఆరెంజ్ జోన్లలో ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్టణం, శ్రీకాకుళం, కడప, అనంతపురం ప్రకాశం ఉన్నాయి. గ్రీన్ జోన్‌లో విజయనగరం ఉంది. దీంతో దేశవ్యాప్తంగా రెడ్ జోన్ల సంఖ్య తగ్గింది. గత 15 రోజుల్లో ఆ సంఖ్య 23 శాతం తగ్గినట్లు అధికారులు చెప్పారు. ఏప్రిల్ 15వ తేదీన 170గా ఉన్న రెడ్ జోన్ల సంఖ్య.. ఏప్రిల్ 30వ తేదీకి 130కి చేరుకున్నది. ఎటువంటి కొత్త కోవిడ్ కేసులు లేని గ్రీన్ జోన్ల సంఖ్య కూడా 356 నుంచి 319కి తగ్గింది. అంటే వైరస్ కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు అధికారులు ఓ అంచనాకు వచ్చారు. అయితే ఆరెంజ్ జోన్లు మాత్రం పెరిగాయి. 207 నుంచి 284 వరకు ఆ జిల్లాల సంఖ్య పెరిగింది. రెడ్,ఆరెంజ్ జోన్లలో కంటైన్మెంట్ చర్యలు పటిష్టంగా ఉండాలన్నట్లు ప్రభుత్వం తన లేఖలో పేర్కొన్నది.

## అఫ్గాన్ ఆర్మీ శిబిరంపై తాలిబన్ల దాడి

### ముగ్గురు మృతి..పలువురికి గాయాలు

కాబూల్,మే1(ఆర్ఎన్ఎ): కరోనా కష్టకాలంలోనూ తాలిబన్లు రెచ్చిపోతున్నారు. ఆఫ్గనిస్తాన్‌లో వరుస బాంబు దాడులకు పాల్పడుతున్నారు. కాబూల్ శివార్లలో ఆర్మీ ప్రత్యేక బలగాల స్థావరంపై ఆత్మాహుతి దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా..మరో 15 మంది గాయపడ్డట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఈ వారంలో కాబూల్‌లో ఆత్మాహుతి దాడి జరగడం ఇది రెండోసారి. బుధవారం ఘటన మరవక ముందే ఈ దాడి జరిగింది. అయితే ఆఎ÷-గాన్ మంత్రి, యూఎస్ దళాల కమాండర్ జనరల్ అసదుల్లా ఖలీద్‌లు ఆర్మీ స్థావరాన్ని సందర్శించి వెళ్లిన మరుసటి రోజే ఈ దాడి జరిగింది.

## సముద్రంలో కూలిన కెనడా హెలికాప్టర్

టొరంటో,మే1(ఆర్ఎన్ఎ): కెనడాలో విషాదం చోటుచేసుకుంది. ఆ దేశానికి చెందిన మిలిటరీ హెలికాప్టర్ సముద్రంలో కూలిపోయింది. గ్రీన్, ఇటలీ దేశాల అంతర్జాతీయ సముద్ర సరిహద్దుల్లో పహరా కాస్తున్న నాటో నేవల్ టాస్క్‌ఫోర్స్ రాయల్ కెనడా నేవీ హెలికాప్టరు గ్రీన్ లోని లోనియన్ సముద్రతీరంలో కుప్పకూలిందని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రుడీ తెలిపారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఐదుగురు గల్లంతు అయ్యారని తెలిపారు. గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, వారంతా క్షేమంగా భయటపడాలని కోరుకుంటున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మే 7 వరకు ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ పాటించాలి: సీపీ అంజనీకుమార్

హైదరాబాద్, మే1: లాక్‌డౌన్‌లో ఇబ్బందులు పడుతున్న పేదలకు హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. జియాగూడ, కార్వాన్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో ఉన్న పేదలకు 16 రకాల సరకులు అందించారు. నగరంలోని పాలు ప్రాంతాల్లో స్థానిక దాతలు, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు సీపీ వివరించారు.మెహిదీపట్నం రైతుబజార్ ముందు పోలీస్ సిబ్బందికి థర్మల్ స్టీల్ వాటల్ బాటిళ్లను అందించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో భౌతిక దూరం పాటిస్తూ నిత్యావసరాలు పంపిణీ చేశామని సీపీ తెలిపారు. కరోనా నివారణకు ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ పాటించాలని కోరారు. మే 7 వరకు ప్రతి ఒక్కరు లాక్‌డౌన్ పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# వూహాన్ గుట్టురట్టు చేస్తాం

### వైరాలజీ ల్యాబ్ నుంచే కరోనా పుట్టుక
### చైనా పారదర్శకంగా వ్యవహరించడం లేదు
### డ్రాగన్‌పై భారీ స్థాయిలో వాణిజ్య ఆంక్షలు అమలు
### మరోమారు వెల్లడించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్,మే1(ఆర్ఎన్ఎ): మహమ్మారి కరోనా వైరస్‌కు వుహాన్‌లోని ల్యాబ్‌కు సంబంధాలున్నట్టు తెలుస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇప్పటికే చైనాపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్న ట్రంపం వ్యూహాన్ గుట్టును బయట పెడతామని అంటున్నారు. ప్రాణాంతక అంటువ్యాధి పుట్టుకకు కారణమైన చైనాపై నూతన టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించారు. అంటువ్యాధి కోవిడ్‌కు వుహాన్ ప్రయోగశాలను అనుసంధానించే సాక్ష్యం తాను చూశానని చెప్పుకొచ్చారు. కోవిడ్‌పై డ్రాగన్ దేశం పారదర్శకంగా వ్యవహరించడంలేదని ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. చైనాలోని వుహాన్ నగరంలో ఉన్న వైరాలజీ ల్యాబ్‌తో కరోనా వైరస్‌కు లింకు ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశంపై మరోసారి భారీ స్థాయిలో వాణిజ్య ఆంక్షలు అమలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వైరస్ వల్ల సుమారు 2.30 లక్షల మంది చనిపోయారు. నోవెల్ కరోనా వైరస్ వుహాన్ వైరాలజీ ల్యాబ్ నుంచి విస్తరించినట్లు వదంతులు వస్తున్న నేపథ్యంలో.. దీనిపై మీడియా సమావేశంలో ట్రంప్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కరోనా మహమ్మారికి వుహాన్ ల్యాబ్‌తో లింకు ఉన్నట్లు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా అని రిపోర్టర్లు అడిగిన ప్రశ్నకు ట్రంప్ అవునని సమాధానం ఇచ్చారు. అంత నమ్మకంగా ఎలా చెబుతున్నారని మరో ప్రశ్న వేయగా.. ఆ విషయాలను తాను బహిర్గతం చేయదలుచుకోలేదన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి విషయంలో చైనా పొరపాటు చేసినట్లు ట్రంప్ పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. చైనా వస్తువులపై అధిక సుంకాలు విధించనున్నట్లు కూడా తెలిపారు. కాగా, కరోనా కట్టడికి దేశవ్యాప్త లాక్‌డౌన్ విధించడంతో.. గత ఆరు వారాల్లోనే 30 మిలియన్ల అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోయారు. దేశ ఆర్థికరంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో ట్రంప్ సర్కార్ చైనాపై విమర్శలు ఎక్కుపెట్టింది. ఎన్నికలు ముంచుకుని వస్తున్న వేళ దేశంలో ప్రతిష్టను పెంచుకునే క్రమంలో చైనాపై విమర్శల దాడిని పెంచారు. మరోవైపు కరోనా విపత్తుతో ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో చీకటి నెలకొంటుందని, యూరప్‌లో కూడా ముందెన్నడూ లేని ఆర్థిక విపత్తు తలెత్తుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరించారు. ఇక ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ దాడిలో రెండులక్షల 30వేల మంది మరణించగా.. 63 వేల మరణాలతో అమెరికా టాప్‌లో ఉంది. దాదాపు ప్రపంచంలోని సగం జనాభా లాక్‌డౌన్ నిబంధనలతో ఇళ్లకే పరిమితమైంది. ఇదిలాఉండగా.. గతేడాది వుహాన్‌లోని మాంసం మార్కెట్‌లో కోవిడ్ పుట్టుకొచ్చిందని కొందరు భావిస్తుండగా.. ఓ ల్యాబ్‌లో గబ్బిలాలపై పరిశోధనలు చేస్తుండగా వైరస్ బయటిపడిందని మరికొందరు ఆరోపిస్తున్నారు. వైరస్ పుట్టుకొచ్చిన తొలినాళ్లలో చైనా పారదర్శకంగా వ్యవహరించకపోవడంతోనే ప్రపంచం నెత్తిన కరోనా పిడుగై పడిందనే విమర్శలున్నాయి.

## సరిహద్దు జిల్లాల్లో మరింత అప్రమత్తం

### ఆంధ్రా,మహారాష్ట్ర సరిహద్దుల్లో నిఘా

హైదరాబాద్,మే1(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలెవరూ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు వెళ్లకుండా తెలంగాణ సర్కార్ బ్యాన్ విధించింది. కరోనా వ్యాధి తీవ్రత నేపథ్యంలో జిల్లా సరిహద్దులను మూసివేశారు. సరిహద్దు జిల్లాలలో నివసిస్తున్న పౌరులకు ఈ మేరకు ఆదేశాలు జారీ అయాయి. ఏపీ, మహారాష్ట్రల్లో అధిక సంఖ్యలో కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నందున తెలంగాణా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వైద్యం, అత్యవసర పనులకు కూడా ఏపీ, మహారాష్ట్రల్లోకి వెళ్లడానికి వీలు లేదని సరిహద్దుల్లోని ప్రాంతాల ప్రజలను ఆదేశించింది. నిర్ణయ అమలుకు పోలీసు బలగాలను పెంచింది. భద్రతను కట్టుదిట్టం చేసింది.కర్నూలులో మొత్తం 386 కరోనా బారిన పడ్డారు. 9 మంది మరణించారు. కర్నూలులో కరోనా కేసులు ఎక్కువగా ఉండడం.. తెలంగాణ లోని గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు అక్కడికి వెళుతున్న నేపథ్యంలో రాకపోకలను నిషేధించింది. గుంటూరు జిల్లాలో మొత్తం 287 కేసులు నమోదు అయ్యాయి. 8 మంది మరణించారు. కృష్ణ జిల్లాలో మొత్తం 246 పాజిటివ్ కేసులొచ్చాయి. 8 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం, నల్గొండ జిల్లాల వాళ్లు కూడా విజయవాడ, గుంటూరు వైపు వెళ్లడానికి వీలు లేకుండా ప్రభుత్వం భద్రతను పెంచింది.

# ఢిల్లీలో కొత్త జోన్లను ప్రకటించిన కేంద్ర ఆరోగ్యశాఖ

### రెడ్‌జోన్ పరిధిలో దేశరాజధాని ఢిల్లీ
### క్రమంగా పెరుగుతోన్న కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య
### అధికారులతో సమీక్షించిన ఢిల్లీ సిఎం కేజ్రీవాల్
### కోట నుంచి విద్యార్థులను రప్పించేందుకు ఆదేశాలు

న్యూఢిల్లీ,మే1(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో కరోనా వైరస్ విజృంభిస్తోంది. మొత్తం 11 జిల్లాల్లోనూ వైరస్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం గుర్తించిన రెడ్‌జోన్ల జాబితాలో అన్ని జిల్లాలను చేర్చింది. అంతేకాకుండా దేశ రాజధాని పరిధిలోని ఎన్‌సీఆర్ అంటే నేషనల్ క్యాపిటల్ రీజియన్ ప్రాంతంలో హాట్ స్పాట్ జిల్లాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్రం గుర్తించింది. వీటిలో ఫరీదాబాద్, గౌతమ్ బుద్దా, సోనీపేట్, నోయిడా సిటీలు కూడా ఉండటం గమనార్హం.

ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల్లో ఆయా జిల్లాలను హాట్‌స్పాట్ జోన్లుగా నోటిఫై చేసింది. ఢిల్లీతో పాటు ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి మెట్రో నగరాలను కూడా కేంద్రం రెడ్‌జోన్ల జాబితాలో చేర్చింది. దేశ వ్యాప్తంగా మొత్తం 132 రెడ్‌జోన్లను కేంద్ర గుర్తించిన విషయం తెలిసిందే. వైరస్ తీవ్రతను బట్టి రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లగా వివిధ ప్రాంతాలను విభజించింది. దేశంలోని 733 జిల్లాలను మూడు జోన్లుగా ప్రకటించింది. కొత్త జాబితా ప్రకారం రెడ్‌జోన్‌లో 130 జిల్లాలు, ఆరెంజ్ జోన్‌లో 284, గ్రీన్ జోన్‌లో 319 జిల్లాలు ఉన్నాయి. రెడ్‌జోన్‌లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లోని 19 జిల్లాలు, మహారాష్ట్రలో 14, తమిళనాడులో 12, ఢిల్లీలో 11, పశ్చిమబెంగాల్‌లో 10 జిల్లాలు ఉన్నాయి. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్‌లు రెడ్‌జోన్‌లోనే ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్‌లను నో యాక్టివిటీ జోన్లుగా ప్రకటించింది. ఈ జోన్లలో ఎలాంటి కార్యకలాపాలకు ప్రభుత్వం అనుమతించమని వెల్లడించింది. మరోవైపు ఢిల్లీలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం ఉదయం నాటికి మొత్తం కేసుల సంఖ్య 3515కు చేరగా.. మృతుల సంఖ్య 59కి పెరిగింది. దీంతో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అధికారులు మరింత అప్రమత్తం చేశారు. ఇక రాజస్తాన్‌లో కోటాలో చికుక్కున్న వారి కోసం ఆప్ సర్కార్ ప్రత్యేకంగా బస్సులను పంపింది. కోటాలో ఉన్న విద్యార్థులను దాదాపు 40 బస్సులతో ఢిల్లీకి తరలించనున్నారు. వారందరినీ స్వస్థలాలకు చేర్చిన తరువాత.. ప్రతి ఒక్కరూ 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉండాలని ఆదేశాలు జారీచేసింది. మరోవైపు రాష్ట్రంలో వలస కార్మికులను వారి స్వస్థలాలకు పంపేందుకు ఏర్పాటు చేస్తున్నామని సీఎం కేజీవ్రాల్ తెలిపారు. దీని కొరకు శుక్రవారం ముఖ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# కేంద్రమంత్రులతో ప్రధాని భేటీ

### లాక్‌డౌన్ తదితర అంశాలపై చర్చ
### నేడు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్న మోడీ

న్యూఢిల్లీ,మే1(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ కట్టడికి దేశ వ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ మే 3తో ముగియనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. లాక్‌డౌన్‌ను పొడిగిస్తారా.. లేక ఆంక్షలను సడలిస్తారా అనేది కేంద్ర ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. ఈ క్రమంలోనే శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగించనున్నారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని ఆయన నివాసంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ భేటీతో అయ్యారు. ఈ ప్రధాన భేటీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, పీయుష్ గోయల్‌తో పాటు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గాబా, సీడీఎస్ బిపిన్ రావత్ కూడా పాల్గొన్నారు. లాక్‌డౌన్‌పై అనుసరించాల్సిన వ్యూహాలు, కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రముఖంగా చర్చిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కరోనాపై జరుగుతున్న పోరులో మే నెల అత్యంత కీలకమని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. హాట్‌స్పాట్స్‌ను కఠినంగా నియంత్రించడం, గ్రీన్‌జోన్స్‌ను సురక్షితంగా కాపాడుకోవడమన్న రెండు అంశాలు అమితాతుమి తేల్చేస్తాయని అభిప్రాయపడ్డారు. రైల్వే, విమాన ప్రయాణం, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులను మే నెల మొత్తం బంద్ చేయడమే మేలని స్పష్టం చేశారు. ఇదే విషయంపై ప్రధాని మోదీ శనివారం ప్రసంగంలో చర్చించే అవకాశం ఉంది. ఇక వైరస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తిస్తూ కొత్తగా రెడ్, ఆరెంజ్ జోన్లను కేంద్రం గుర్తించిన విషయం తెలిసిందే.

## భారీగా తగ్గిన ఎల్పీజి సిలిండర్ ధరలు

న్యూఢిల్లీ,మే1(ఆర్ఎన్ఎ): వంటగ్యాస్ వినియోగదారులకు మరోసారి ఊరట లభించింది. వరుసగా మూడో సారి సిలిండర్ ధర దిగివచ్చింది. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.214 తగ్గింది. ఈ తగ్గింపుతో ఎల్పీజీ సిలిండర్ ధర రూ.583 నుంచి ప్రారంభం కానుంది. అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరలు భారీగా దిగిరావడంతో గ్యాస్ సిలిండర్ ధర భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. తగ్గిన ధర నేటి నుంచే అమల్లోకి రానుంది. అటు నాన్‌సబ్సిడీ సిలిండర్ ధర రూ. 336 తగ్గి.. రూ.988 చేరింది. తగ్గిన ధరలతో హైదరాబాదులో 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 207 తగ్గి.. రూ. 589.50 నుంచి ప్రారంభమవుతుంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర కూడా రూ. 336 క్షీణించి ప్రారంభ ధర రూ. 988 కి చేరింది.

## చరిత్రలో నేటినిజం

కం॥ దైవపైన భారమాత్మను
పరిపరి విధములుగ జూపు ప్రజ్ఞానిధిగా
వరసుమిగ చెబుతాందెను
చిరకీర్తి జాంది...సత్య జీవరే... వసుధనే॥

(మే 2 సత్యజిత్ రే జననం)

-రాధశ్రీ
సెల్: 9494481210

## సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేసిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

నారాయణపేట, మే 1: జిల్లాలోని ఎక్‌లాస్‌పూర్ గ్రామంలో ఉన్న తెలంగాణ-కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టును రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. సరిహద్దు ప్రాంతం కావునా రాకపోకల విషయంలో పటిష్ట నిఘా అమలు చేయాలని పేర్కొన్నారు. అంతకుక్రితం మంత్రి ఎక్‌లాస్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. నారాయణపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు.

# నిర్మాణ కార్యకలాపాలకు పోలీసులు సహకరించాలి: డీజీపీ

హైదరాబాద్, మే1: జంట నగరాల్లో నిర్మాణ కార్యకలాపాలను అనుమతించాలని డీజీపీ మహేందర్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. సిమెంట్, కాంక్రీట్, ఇసుక, స్టీల్ తదితర నిర్మాణ సామగ్రితో వెళ్లే లారీలు తదితర వాహనాలను అడ్డుకోవద్దని సూచించారు. నిర్మాణాలు జరిగే ప్రాంతాలకు ఆయా వాహనాలు వెళ్లేలా పోలీసులు సహకరించాలని కోరారు. అన్ని పోలీస్ చెక్‌పోస్ట్‌లను కూడా వెంటనే అప్రమత్తం చేయండి అంటూ సిటీ పోలీసులకు ఒక సందేశాన్ని పంపించారు. లాక్‌డౌన్ మొదలైన మార్చి 24 నుంచి నగరంలో నిర్మాణ కార్యకలాపాలు పూర్తి స్తంభించిపోయిన విషయం తెలిసిందే. భవన, పారిశ్రామిక నిర్మాణ కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వం పాక్షికంగా అనుమతించిన విషయం తెలిసిందే.

# ఇత్తేసి పొత్తు కూడుతున్న బిజెపి

### అన్నీ తానే చేస్తున్నట్టు డాంబికాలు
### మేడే ఉత్సవాల్లో కార్మికులకు సరుకులు పంపిణీ
### కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో కరోనా కంట్రోల్: ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,మే1(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వ శైలి, బీజేపీ వ్యవహారం ఇత్తేసి పొత్తు కూడినట్లుగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేసే సాయంలో కేంద్రం చెల్లించేది కొద్ది మొత్తమేనని, బీజేపీ మాత్రం మొత్తం మేమే ఇస్తున్నామ1ని గొప్పలు పోతున్నదని ఆరోపించారు. వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ మండలం కోనాయిమాకులలో మంత్రి మేడే ఉత్సవాల్లో పాల్గొన్నారు. మేడే సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి ఎర్రజెండాను ఆవిష్కరించారు.లాక్‌డౌన్ కారణంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలో పెన్షన్లను అందిస్తున్నామని తెలిపారు. పెన్షన్ల కోసం రూ.12 వేల కోట్లను రాష్ట్రం ఇస్తుండగా, అందులో రూ. రెండు వందల కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లిస్తుందన్నారు. దీనికి అంతా తామే చేస్తున్నట్లు బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు వేతనాన్ని రూ.221 నుంచి రూ.237కు పెంచిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రోజుకు పది లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వం కూడా తెలంగాణ మాత్రమేనని చెప్పారు. కరోనా కాలంలో దేశంలో ఇంతగా ఉపాధి ఎక్కడా లభించడం లేదని ఎర్రబెల్లి తెలిపారు. పెరిగిన వేతనాలు ఏప్రిల్ నుంచే చెల్లిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణలో అసలు సిసలైన పరిపాలన సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే సాగుతోందని మంత్రి అన్నారు. కార్మికుల కడుపునింపుతూ ఉపాధి కల్పిస్తూ ఉపాధి కూలీలకు వేతనాలు పెంచుతూ బియ్యం, డబ్బులు ఉచితంగా అందిస్తూ కార్మికులను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారని తెలిపారు.అనంతరం కూలీలు, కార్మికులు, ఆటోడ్రైవర్లు, నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రజలందరికీ క్షేమం, అందరికీ సంక్షేమం, రాష్ట్రానికి అభివృద్ధిని అందిస్తున్న ముఖ్యమంత్రి పరిపాలన దేశంలో మరెక్కడా లేదనారు కార్మికులకు సరైన పనికి సరైన వేతనాలు ఇప్పిస్తున్నది తెలంగాణ ప్రభుత్వమేనని అన్నారు కార్మికులందరికీ కరోనా కాలంలో వేతనాలివ్వాలని యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది.

భవన నిర్మాణ కార్మికులకు సైతం వసతులు కల్పించాలని, వేతనాలివ్వాలని, భోజనాలు పెట్టాలని బిల్డర్లను ఆదేశించారు. ఇప్పటికీ ఇవన్నీఅమలవుతున్నాయని ఆయన చెప్పారు. అలాగే పొట్టచేత పట్టుకుని మన రాష

# కార్మిక శక్తికి మించినది ఏమీలేదు

నేటినిజం
శనివారం 2-5-2020

కార్మిక శక్తికి మించినది ఏమీలేదు. కానీ వారికి మిగిలింది కూడా ఏమీలేదు. మేడే ఒక్క రోజు సెలవు తప్ప. పెట్టుబడి దారీ వ్యవస్థ ఏ దేశమయినా అమెరికా కేంద్రస్థానం. రోజుకు పది, పదిహేను గంటలు పనితో విసిగిపోయిన కార్మికులు శ్రమదోపిడికి వ్యతిరేకంగా గళమెత్తిన సందర్భమే మేడే! అమెరికాలోని చికాగో నగరం వేదికగా 1986లో మే ఒకటవ తారీఖున పెల్లుబుకిన నిరసనకు మేడే పునాది. అదే తర్వాత ప్రపంచ కార్మికులకు పర్వదినమయింది. దానితోపాటే వీరికి కష్టాలు, కన్నీళ్ళు కూడా అధికమయ్యాయి. కట్టుబాట్లు పెరిగిపోయాయి. ఉద్యోగభద్రత గాలిలో దీపమయింది. ప్రమాదాల బారిన పడినవారి పట్ల సానుభూతి, పరిహారం కూడా కొరవడింది. ముఖ్యంగా ప్రపంచదేశాలను సుడిగాలి లా చుట్టేస్తున్న 'ప్రపంచీకరణ' కార్మికుల పాలిట ఆశనిపాతం అవుతోంది. ప్రజాస్వామ్యభారతం సైతం దీనికి మినహాయింపుకాదు. రెండు దశాబ్దాల క్రితం ఆర్థిక సంస్కరణలకు తెరలేచిన మన దేశంలో ఆర్థిక స్థితిగతులు, పని పరిస్థితులు రోజురోజుకూ తీసికట్టుగా మారిపోతున్నాయి. ఒక పనికి పదిమంది వరస కడుతున్నారు. కార్మికుల విలువలు పడిపోతున్నాయి. లెక్కకు ఎన్ని కార్మిక చట్టాలున్నా అమలులో చెత్తగా మారిపోతోంది. ఏదో ఒకపని, ఉద్యోగంలోని వారి పరిస్తితే ఇలా ఉంటే కొత్తగా ఉద్యోగాల్లోకి చేరినవారికి భిన్నమయిన సమస్యలు, సవాళ్ళు ఎదురవుతున్నాయి. ఉద్యోగ ఉపాధి రంగంలో పెనుసంక్షోభం దృష్ట్యా ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత ప్రబలే ప్రమాదం ఉందని ఐఎల్ఓ హెచ్చరిస్తోంది. దీనికి కారణాలు ఎన్నో ఉన్నాయి. కొత్త ఉద్యోగాల సంఖ్య పరిమితంగా ఉంటే తగిన నైపుణ్యాలు లేకపోవడం మరోసమస్య.

ఇటీవలి కాలంలో మనదేశంలో మరొక ముఖ్యాంశం ఉద్యోగాల సంఖ్యలో తగినంత గా సృష్టి లేకపోవడం ఏటా జెడీపీ పెరుగుతోంది. జనసంఖ్యా ఎక్కువవుతోంది. అయినా ఉద్యోగాలలో పెరుగుదల శూన్యం. ఇంతటి సంక్లిష్టమయిన పరిస్థితి మరేదేశంలో కూడా కనిపించదేమో! అయితే, ఏదేశమయినా ఆర్థికంగా సమున్నత స్థానంలో ఉండాలంటే అక్కడ కార్మికుల శ్రమశక్తికి గుర్తింపు ఉండితీరాలి. శ్రమించేవాడు లేకుంటే అభివృద్ధి సాధ్యం కాదన్నది నిర్వివాదం. ప్రభుత్వం, వివిధ సంస్థల యాజమాన్యాలు కార్మికులకు తగిన ప్రాధాన్యం ఇచ్చినపుడే సంపద సృష్టి సాధ్యం. యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అందుబాటులోకి వచ్చినా వాటిని నడిపేందుకు కూడా శ్రామికుడు కావాలి. అందుకే ఒక వస్తువుకు విలువను కల్పించేది కార్మికులేనని కారల్‌మార్క్స్ అన్నాడు. కార్మికులకు శ్రమకు తగిన ఫలితం లభించేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కార్మికులు నిరాశ, నిస్పృహల్లో మునిగిపోతుంటే ఏదేశమయినా అభివృద్ధి సాధించలేదు. ఆర్థికంగా అగ్రరాజ్యం కావాలని ఉబలాటపడుతున్న మన దేశం ఎంతో కీలకమయిన కార్మికశక్తిని విస్మరించి ముందుకు సాగడం సాధ్యం కాదని మరోసారి ప్రభుత్వం గుర్తిస్తే తప్ప మేడే అనేరోజుకు సార్థకత!!

## మహారాష్ట్ర సంక్షోభానికి తెర

### గవర్నర్ లేఖపై సానుకూలంగా స్పందించిన ఎన్నికల సంఘం

### ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఇసి అనుమతి

ముంబై,మే1(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే కి ఊరట లభించింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న శాసన మండలి స్థానాలకు ఎన్నికలను ప్రకటించాలని గవర్నర్ కోష్యారీ ఎన్నికల కమిషన్‌ను కోరగా అందుకు ఇసి అంగీకరించింది. దీంతో సిఎంగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రేకు ఊరట లభించనుంది. రాష్ట్రంలో రాజకీయ అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీన్ని నివారించేలా చూడాలని ఉద్ధవ్ నిన్న ప్రధాని మోదీకి ఫోన్ చేసి అభ్యర్థించిన సంగతి తెలిసిందే. దీన్ని పరిశీలిస్తానని మోదీ ఆయనకు హామీ ఇచ్చారు. ఉద్ధవ్ ఠాక్రేని శాసన మండలికి నామినేట్ చేస్తూ మంత్రివర్గం చేసిన సిఫారసుపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా రెండు రోజులు జాప్యం చేయడంపై ఉద్ధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే తాజాగా ఆయన ఈసీని కౌన్సిల్ ఎన్నికలపై సంప్రదించడంతో ఉద్ధవ్ కలవరం తగ్గింది. మే 28 లోగా కౌన్సిల్ కి ఎన్నికలు జరగవలసి ఉంది. ఆ రోజుతో సీఎం గా ఉద్ధవ్ పదవీకాలం ఆరు నెలలు పూర్తి అవుతుంది. ఆలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగకపోతే అయన పదవిని కోల్పోవలసి వస్తుంది. దీంతో ముఖ్యమంత్రి ఉద్ధవ్‌ఠాక్రేకు కరోనా కన్నా పదవీ సంక్షోభం ఎక్కువగా పట్టుకుంది. సీఎం పదవి ఉంటుందా ఊడుతుందా అన్న దానిపై టెన్షన్ వాతావరణం కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఖాళీ అయిన 9 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. లాక్‌డౌన్‌ను అమలుచేస్తున్న నేపథ్యంలో కేంద్రం ఇచ్చిన సడలింపుల దృష్ట్యా కొన్ని మార్గదర్శకాలతో ఎన్నికలు నిర్వహించాల్సిందిగా కోరారు. దీనిని ఇసి అంగీకరించి మే మూడో వారంలో ఎన్నికలకు అంగీకరించింది. మరోవైపు ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేను శాసన మండలి సభ్యునిగా నామినేట్ చేయాలంటూ గవర్నర్ భగత్‌సింగ్ కోష్యారిని మంత్రివర్గం మరోసారి అభ్యర్థించింది. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటైన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించింది. గడిచిన రెండు వారాల్లోనే రాష్ట్ర కేబినెట్ రెండుసార్లు ఈ ప్రతిపాదనను గవర్నర్ ముందుంచింది. అయితే కోష్యారి మాత్రం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2019 నవంబర్ 28 న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఠాక్రే ఇప్పటివరకు ఏ చట్టసభల్లోనూ సభ్యుడు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆరునెలల లోపు ఉభయ సభల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాల్సి ఉంది. రానున్న మే 28 నాటికి ఠాక్రే సీఎంగా ఎన్నికై ఆరు నెలల పదవీకాలం ముగియనుంది. ఈ లోపు ఏదైనా సభకు ఎన్నిక కాకపోతే ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే ఒక నెల సమయం మాత్రమే ఉంది. కరోనా సంక్షోభంలో ఇప్పుడు ఎన్నికలు జరిగే ప్రసక్తి లేదు. ఈ నేపథ్యంలో గవర్నర్ ఇసికి లేఖ రాయడం, ఇసి అంగీకరించడంతో ఇక సంక్షోభం తొలగినట్లుగానే భావించాలి.

## సోషల్ మీడియాలో ఇష్టారీతిన పోస్టులు

### 600 పోస్టులు తొలగించిన ముంబై పోలీసులు

### 155మందిని అరెస్ట్ చేసిన కేసు నమోదు

హైదరాబాద్,మే 1(ఆర్ఎన్ఎ):కరోనా కష్కాలంలో సోషల్ మీడియా.. ఎవరికి తోచింది వారు ఓ పోస్టు పెట్టేయడం చేతులు కడిగేసుకోవడం షరా మామూలై పోయింది. దీనికి ముంబై పోలీసులు సీరియస్ అయ్యారు. కరోనాకు సంబంధించిన 600 అభ్యంతరకరమైన పోస్టులు సోషల్ మీడియా నుంచి తీసిపారేశారు. అందులో ఫేక్ న్యూస్ ఐటెంలు, మతోన్మాదన్ని రెచ్చగొట్టే వీడియోలు, ఆడియోలు కూడా ఉన్నాయి. అలా తొలగించి వదిలేయకుండా ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 155 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ముంబై పోలీసు సైబర్ విభాగం డీఐజీ హరీశ్ బైజాల్ తెలిపారు. లాక్‌డౌన్ సందర్భంగా ముంబై పోలీసు గూఢచార విభాగం సోషల్ మీడియా ల్యాబ్ ఆ పోస్టులను తొలగించింది. వాటిలో అత్యధికం తప్పుదోవ పట్టించేవి, నిరాధారమైనవి, ప్రజల్లో భయోత్పాతం సృష్టించేవి, మతపరమైన ఉద్రిక్తతలు కలిగించేవి ఉన్నాయని బైజాల్ చెప్పారు. మొదట్లో కరపోనా గురించి తప్పుడు సమాచారపం ఇచ్చే పోస్టులు ఎక్కువగా వచ్చాయని, తర్వాత తబ్లీగీ జమాత్‌పై సందేశాలు దావానలంలా వ్యాపించాయని వివరించారు. 'మేం అన్నీ జాగ్రత్తగా గమనిస్తుంటాం.. తర్వాత విశ్లేషణ జరిపి ఎవరెవరు లేదా ఏయే గ్రూపులు రెచ్చగొట్టే వీడియోలు, పోస్టులు పెడుతున్నారో తెలుసుకుంటాం. ఆపై అలాంటి శక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని బైజాల్ చెప్పారు. ఇందుకు 30 మంది సాంకేతికంగా సుశిక్షితులైన బృందం రోజుకు 24 గంటలు, వారానికి 7 రోజులు పనిచేస్తుంటుందని తెలిపారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టెలిగ్రాం వంటి అన్ని సామాజిక మాధ్యమాలను పరిశీలిస్తుంటారని చెప్పారు.

## జిల్లా సరిహద్దుల్లో పటిష్ట నిఘా: కలెక్టర్

భద్రాద్రి మే 1(ఆర్ఎన్ఎ):(ఆర్ఎన్ఎ): జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా కొనసాగాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంవి రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం భద్రాచలం నుండి దుమ్ముగూడెం వెళ్లే రహదారిలో భద్రాచలం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వాహనాల నమోదు రిజిస్టర్ ను పరిశీలించారు. మహారాష్ట్ర, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చే ప్రజలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో వ్యాధి తీవ్రత ఆందోళన కలిగిస్తోందని, ఈ సమయంలో మన రాష్ట్ర ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లా నుండి వెళుతున్న వలస కూలీల వాహన నంబరు, ఏ రాష్ట్రానికి వారు వెళ్తున్నారు సమగ్ర వివరాలతో పాటు వారిలో ఒకరి ఫోన్ నెంబరు, ఫోటో తీసుకోవాలని అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో ఆర్డీవో స్వర్ణలత, డీపీవో ఆశాలత, తాహసిల్దార్ శేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

హైదరాబాద్,మే 1(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న దుర్ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు మృత్యువాతపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కురవి మండలం సీరోలు గ్రామ సమీపంలోని ఊర చెరువులో బర్రెల కోసం వెళ్లి వెంకన్న(55) అనే వ్యక్తి నీట మునిగి మృతిచెందాడు. అదేవిధంగా మెదక్ జిల్లాలోని హవేలీ గన్‌పూర్ మండలం వాడి గ్రామశివారులో పోచారం డ్యాంలో పడి వాడి గ్రామానికి చెందిన సాయిరాం(22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై యువకుడు తనువు చాలించాడు. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండలంలోని రైల్వే స్టేషన్‌లో ఓ వలస కార్మికుడు మృతిచెందిపడి ఉన్నాడు. వరంగల్ నుంచి కాగజ్‌నగర్‌కు రైల్వే పట్టాల వెంట నడిచి వెళుతూ వడదెబ్బకు గురై మృతిచెందినట్లుగా సమాచారం.

## కర్నూలులో కరోనాను జయించిన 13 మంది డిశ్చార్జ్

కర్నూలు,మే 1(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనాను జయించిన 13 మందిని నంద్యాల శాంతిరామ్ జిల్లా కోవిడ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇప్పటివరకు కర్నూలులో 56 మంది కరోనా నుంచి కోలుకున్నారు. జిల్లాలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఒకే రోజు 13 మంది ఈ మహమ్మారి నుంచి కోలుకుని డిశ్చార్జి అవ్వడం కొంత ఊరటనిచ్చే విషయంగా పేర్కొనవచ్చు. కాగా డిశ్చార్జి అయిన 13 మందిలో మొత్తం పురుషులే ఉన్నారు. వారంతా 17 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరందరికి ఎటువంటి ఖర్చు లేకుండా 2 వేలనగదు ,పౌష్టికాహారం, పండ్లు కిట్‌లు అందించారు.

# 3 తరవాత ఏమిటన్న ఉత్కంఠ

హైదరాబాద్, మే1:కేంద్రం విధించిన లాక్‌డౌన్ ఈ నెల మూడున ముగియనుంది. మరో రోజు మాత్రమే గడువుంది. అయితే లాక్‌డౌన్ ఎగ్జిట్ పాలసీ ఎలా ఉండబోతున్నదీ తెలియదు. వలస కూలీలను స్వరాష్ట్రాలకు తరలించేందుకు అనుమతి ఇవ్వడాన్ని బట్టి చూస్తుంటే ఇప్పటికిప్పుడు మొత్తంగా లాక్‌డౌన్ ఎత్తేసే అవకాశం కానరావడం లేదు. కూలీలు స్వరాష్ట్రాలకు తరలిపోవడం చూస్తుంటే దీనిని విడతలవారీగా ఎత్తేసే అవకాశం ఉంది. కరోనాకు మందు రాలేదు. ఇంకా పరిశోధనల స్థాయిలోనే ఉన్నాయి. మరో ఆరేడు నెలలకు గానీ స్పష్టత రాదు. అప్పటికి వ్యాక్సిన్ వస్తే ప్రజలకు భరోసా వస్తుంది. ప్రభుత్వం కూడా ధీమాగా ఉంటుంది. అప్పటి వరకు సామాజిక దూరం పాటించాల్సిందే. మాస్కులు ధరించాల్సిందే. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. గుంపులుగా తిరగడం, ప్రయాణాలు చేయడం కుదరదు. వీటికి ఇప్పటికిప్పుడు అనుమతులు కూడా దక్కకపోవచ్చు. మొత్తంగా మే 3 తరవాత ఏం జరుగనుందన్న ఉత్కంఠ మాత్రం దేశ ప్రజల్లో నెలకొంది. తెలంగాణలో 7వరకు ఆంక్షలు ఉంటాయి. దేశంలోని మరికొన్ని రాష్ట్రాలు కూడా ఈ నెలాఖరు వరకు లాక్‌డౌన్ విధించారు. ఇకపోతే గత 40రోజులుగా సాగుతున్న లాక్‌డౌన్ కారణంగా ప్రజల్లో కూడా అవగాహన వచ్చింది. కరోనా అంటే భయం ఏర్పడింది. జాగ్రత్తగా ఉండాలన్న స్పృహ వచ్చింది. పట్టణ ప్రజలతో పోలిస్తే పల్లె ప్రజల్లో జాగరూకత మరింత పెరిగింది. అందువల్ల ప్రజలు కూడా ఇకనుంచి బాజరుకు వెళ్లినా, పని ప్రదేశానికి వెళ్లినా మాస్కులు దరించడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా భావిస్తారు. అభివృద్ధి చెందిన దేశాల కంటే సమర్థవంతంగా కరోనా కట్టడి చేయడంలో భారత్ ముందున్నది. 130 కోట్ల జనాభా ఉన్న దేశంగా మనం ఘన విజయాన్నే సాధించాం. అరకొరగా వైద్య సదుపాయాలు కలిగిన దేశం అయినప్పటికీ కరోనా కట్టడిలో భారత్ ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకున్నది. కంటికి కనిపించని శత్రువుపై అద్భుతమైన పోరాటపటిమ ప్రదర్శించింది. కరోనా వైరస్ భారత్‌లో అల్లకల్లోలం సృష్టిస్తుందని అంచనా వేసిన ప్రపంచ ఆరోగ్యసంస్థ కూడా ఇప్పుడు మన దేశాన్ని ప్రశంసిస్తోంది. తీసుకున్న చర్యలు భేషుగ్గా ఉన్నాయని చెబుతోంది. అభివృద్ధి చెందిన దేశాల కంటే కరోనా కొమ్ములు విరచడంలో మనమే ముందున్నాం. అయినప్పటికీ మే3న లాక్‌డౌన్ ఎత్తివేయాలా వద్దా అన్న మీమాంస కొనసాగుతోంది. కరోనా పరీక్షలు చేయడంలోనూ భారత్ కాస్త వెనుకబడి ఉన్నప్పటికీ పాజిటివ్ కేసులు ఎక్కువగా రాకపోవడం ఊరటనిచ్చే అంశం. ఇప్పటివరకు 8 లక్షల 50వేల మందికి పరీక్షలు నిర్వహించారు. కరోనా పరీక్షల్లో అందరికీ ఆదర్శంగా నిలిచిన దక్షిణ కొరియా కంటే సంఖ్యలో ఇది ఎక్కువ. కానీ జనాభా ప్రాతిపదికన చూస్తే మాత్రం స్వల్పమే. చాలా తక్కువ కేసులు నమోదైన వెంటనే భారత్ మేల్కొంది. లాక్‌డౌన్ ప్రకటించడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి తగ్గిపోయింది. ఫలితంగా కేసుల సంఖ్యను నివారించింది. ప్రపంచ దేశాలతో పోల్చి చూస్తే లాక్‌డౌన్‌పై భారత్ చాలా చురుగ్గా స్పందించింది. చాలా తక్కువ కేసులు నమోదవగానే లాక్‌డౌన్ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ దశలో మే మూడు తరవాత పరిస్థితి ఏమిటన్నది కేంద్రం అధ్యయనం చేస్తోంది. వివిధ దేశాలు అనుసరించిన వ్యూహాలు, విజయాలను అంచనా వేస్తోంది. ఏ దేశం పరిస్థితి మెరుగ్గా ఉంది..అలా ఉండడానికి గల కారణాలు ఏంటన్నది ఆలోచన చేస్తోంది.

కరోనా పుట్టిన చైనాలోని వూహాన్ కూడా పూర్తిగా కుదుట పడింది. అక్కడ కఠినంగా లాక్‌డౌన్ అమలు చేయడం, ప్రజలెవరూ బయటకు రాకుండా కట్టడి చేయడం వల్ల కరోనా వ్యాప్తిని ఆపగలిగారు. కేవలం ఓ రెండు నెలల్లోనే పరిస్థితి సాధారణస్థాయికి వచ్చింది. అలాగే అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందలేదు. అలాగే ఒకరినుంచి మరొకరికి కూడా వ్యాప్తి జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. ఇకపోతే

కరోనా వైరస్ వ్యాప్తితో అతలాకుతలమైన ఇటలీ ఆలస్యంగా అయినా మేల్కొంది. కరోనా వైరస్ తీవ్ర స్థాయిలో ప్రభావం చూపి, ఎంతో మందిని పొట్టన పెట్టుకున్న ఇటలీ దేశంలో సుదీర్ఘకాలం పాటు లాక్‌డౌన్ అమలు పరిచి మెల్లిమెల్లిగా సాధారణ స్థితికి చేరుకుంటున్నారు. వివిధ దశల్లో లాక్‌డౌన్ ఎత్తివేస్తూ సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి ఇటలీ ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు దేవాలు పాటించి చూపిన విధానాలను మనదేశం కూడా అంచనా వేస్తోంది. కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా ఇటలీ దేశం మార్చి 10వ లాక్‌డౌన్ అమల్లోకి తెచ్చింది. యూరప్‌లోని మిగిలిన దేశాల కన్నా.. చాలా ముందుగా లాక్‌డౌన్ అమలు పరిచింది ఇటలీనే. తొలి రోజుల్లో వైరస్ తాకిడికి అతలాకుతలమైంది కూడా ఇటలీనే. ఇటలీలో తొలి కరోనా కేసు ఫిబ్రవరి ఇరయ్యవ తేదీన వెలుగులోకి రాగా, మార్చి 10వ తేదీ నాటికి తీవ్ర స్థాయిలో వైరస్ వ్యాపించింది. ప్రపంచంలోనే అత్యధిక కరోనా కేసులున్న మూడవ దేశంగా, కరోనా మరణాల్లో అమెరికా తర్వాత రెండో దేశంగా ఇటలీ వార్తల్లోకి ఎక్కడంతో లాక్‌డౌన్‌ను కఠినంగా అమలు పరచాల్సి వచ్చింది. అయితే లాక్‌డౌన్ ప్రకటించడంలో ఇటలీ ప్రధాని గిసెప్పీ కాంటే జాప్యం చేశారని అక్కడి విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఎందుకంటే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. మరణాలూ పెరిగాయి. ఇటు మన దేశంలో మొదటి కరోనా పాజిటివ్ కేసు జనవరి 30వ తేదీన వెలుగు చూసింది. మార్చి 24వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలు చేస్తున్నారు. ఇటలీతో పోలీస్తే మనదేశంలో కరోనా కేసులు చాలా తక్కువగా నమోదయ్యాయి. ఇక ప్రస్తుతానికి వస్తే.. మే 4వ తేదీ నుంచి ఇటలీలో లాక్ డౌన్ ఎత్తివేత పక్రియ ప్రారంభం కానున్నది. ఒకేసారి ఆంక్షలను ఎత్తివేయబోమని మనదేశం ఇదివరకే ప్రకటించింది. రోజువారి మినహాయింపులతో నెమ్మదిగా లాక్‌డౌన్ ఎత్తివేస్తామని అధికారులు సూచన ప్రాయంగా చెబుతున్నారు. మే నాలుగవ తేదీన ప్రజలు తమ ఏరియా పరిధులు దాటి ఎక్కడెక్కడికి వెళ్లవచ్చో ప్రకటించే ఛాన్స్ ఉంది. అయితే ప్రజలు అన్ని వేళల, అన్ని చోట్ల మాస్క్‌లు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని ప్రభుత్వం షరతులు విధించనున్నది. భారత్‌లో లాక్‌డౌన్ వల్ల జీడీపీ ఏడు శాతం పడిపోతుందని ఎకానమిస్టులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా లాక్‌డౌన్‌ను క్రమంగా ఎత్తివేయవచ్చని వివిధ సామాజిక, రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భారత్ లాక్‌డౌన్ మే మూడవ తేదీతో పూర్తికానున్ననేపథ్యంలో ప్రధాన మంత్రి మోడీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? ఆయన ఎప్పుడు దేశ ప్రజల ముందుకు వస్తారన్న ఆసక్తి నెలకొంది.

# శవాలదిబ్బగా అగ్రరాజ్యం అమెరికా

### పెరుగుతున్న కరోనా మృతులతో అతలాకుతలం

### రెండో ప్రపంచ యుద్ధాన్ని మించి మరణాలు నమోదు

న్యూయార్క్,మే1(ఆర్ఎన్ఎ): అగ్రరాజ్యం అమెరికాలోని న్యూయార్క్ శవాలగుట్టగా మారింది. స్థానిక ఆంధ్రా క్లైక్లీ శ్మశాన వాటిక వెలుపల మృతదేహాలతో నిండి ఉన్న ట్రక్కును నిలిపి ఉంచటం స్థానికుల కంటపడింది. ట్రక్కు నుంచి దుర్వాసన రావటంతో వారు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హుటాహుటీన నాలుగు ఏసీ ట్రక్కులను ఏర్పాటు చేసి సుమారు 50 మృతదేహాలను ఆ ట్రక్కుల్లోకి మార్చారు. అయితే ఈ సంఘటనపై ఉన్నతాధికారులు ఎవరూ స్పందించడం లేదు. కాగా కరోనా మహమ్మారి బారినపడి న్యూయార్క్‌లో 17,866 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక అమెరికాలో 10,76,129 మందికి కరోనా సోకగా, 62,380 వేల మంది మరణించారు. చిన్న వైరస్..కంటికి కనిపించని సూక్ష్మజీవి. కానీ అగ్రరాజ్యాన్నే కకావికలం చేస్తోంది. ప్రపంచానికే పెద్దన్నలాంటి దేశాన్నే అతలాకుతలం చేస్తోంది. రోజుకో మైలురాయిని అధిగమిస్తూ విధ్వంసం సృష్టిస్తోంది. గతంలో ఉన్న అన్ని రికార్డులను బద్దలుకొడుతోంది. తాజాగా వియత్నాం యుద్ధ మరణాలను కూడా మించిపోయింది. రెండు దశాబ్దాల పాటు కొనసాగిన వార్ కంటే..ఎక్కువ మందిని బలి తీసుకుంది. అత్యంత ప్రభావం చూపిన దేశాల్లో మొదటి స్థానంలో ఉంది అగ్రరాజ్యం అమెరికా. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తిరుగులేని ఆ దేశం..సూక్ష్మజీవి చేతిలో ఓడిపోయింది. చిన్న వైరస్సే కదా..ఏం చేస్తుందిలే..అని లైట్ తీసుకున్నందుకు పెద్దన్నకే చెమటలు పట్టిస్తోంది. ఆ మహమ్మారి కోరల నుంచి ఎలా బయటపడాలో అర్థంకాక.. హేమాహేమీలే తలలు పట్టుకోవలసిన పరిస్థితి. ప్రాణాంతక కరోనా మహమ్మారి అగ్రరాజ్యాన్ని ఛిన్నాభిన్నం చేసేసింది. 3 నెలల్లోనే సుసంపన్న దేశం కాస్తా పాతాళానికి పడిపోయే పరిస్థితికి దిగజార్చింది. అంతకంతకూ తీవ్ర రూపం దాల్చుతూ నిత్యం ఒక్కో మైలురాయిని దాటుతోంది. 24గంటల్లోనే 25వేల కేసులు..2500 మరణాలతో బీభత్సం సృష్టిస్తోంది. ఇప్పటివరకు 11లక్షల కేసులు..62వేల మరణాలతో ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. వరల్డ్‌వైడ్‌గా ఉన్న కేసుల్లో మూడోశాతం..మరణాల్లో నాలుగోశాతం అమెరికాలోనే ఉన్నాయి. 20ఏళ్ల పాటు వియత్నాంతో జరిగిన యుద్ధంలో కంటే..కరోనా బారిన పడి మరణించిన వారే ఎక్కువగా ఉన్నారు. అమెరికా అగ్రరాజ్యంగా ఎదగడానికి ఎన్నో కష్ట నష్టాలను చవి చూసింది. ఆటుపోట్లను ఎదుర్కొంది. క్రమంగా అన్ని రంగాల్లోనూ తిరుగులేని దేశంగా ఆవిర్భవించింది. అమెరికా చరిత్రలో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఘట్టం వియత్నాంతో యుద్ధం. ఆ ఘటనలో లెక్కలేనంత ఆస్తి నష్టం జరిగింది. అమెరికా చావు దెబ్బ తింది ఆ వియత్నాం వార్‌లోనే. ఆ యుద్ధంలో అమెరికా సైనికులు పిట్టల్లా రాలిపోయారు. అమెరికా, వియత్నాం మధ్య 1955లో మొదలైన యుద్ధం 1975 వరకు సాగింది. రెండు దశాబ్దాల్లో సుమారు 58వేల 220మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా కరోనా వైరస్ వల్ల వియత్నాం యుద్ధ సమయంలో కంటే అధిక సంఖ్యలో ప్రాణనష్టాన్ని చవి చూస్తోంది అమెరికా. వియత్నాంలో రెండు దశాబ్దాల్లో చనిపోయిన సైనికుల కన్నా..కేవలం మూడు నెలల వ్యవధిలోనే వైరస్ వల్ల మరణించినవారే ఎక్కువగా ఉన్నారు. 1968 నాటి వియత్నాం యుద్ధంలో ప్రతి లక్ష మందిలో 8.5 మంది అమెరికన్లు మరణించగా, కరోనా వైరస్ బారిన పడి ప్రతి లక్ష మందిలో 17.6 మంది మరణించారు. 1968, జనవరి 31న అత్యధికంగా 246 మంది అసువులు బాశారు. ఆ సంవత్సరంలో అత్యధికంగా 16,899 మంది మరణించారు. కానీ ఇప్పుడు కరోనా ధాటికి రోజుకు వేల సంఖ్యలో కేసులు, మరణాలు నమోదవుతున్నాయి. 2017-18లో ఇన్‌ఫ్లూయెంజా మరణాలను కూడా దాటేసిందని..ఆగస్ట్ చివరినాటికి మృతుల సంఖ్య దాదాపు 75వేలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు వైద్య నిపుణులు. ఐతే అమెరికా చరిత్రలో అత్యధిక ప్రాణ నష్టాలను చవిచూసిన ఘటనలుగా సెకండ్ వరల్డ్ వార్, సివిల్ వార్‌ను చెప్పుకుంటారు. 1941-45 మధ్య కాలంలో జరిగిన రెండో ప్రపంచ యుద్ధంలో..దాదాపు 2 లక్షల 91వేల మందికి పైనే మృతి చెందారు. ఇక 1861-65మధ్య కాలంలో చోటుచేసుకున్న సివిల్ వార్‌లో ..దాదాపు 5లక్షల మంది వరకు చనిపోయారు. దీంతో అగ్రరాజ్యంలో మరణాలలో ఆ రెండు ఘటనలు మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా..కరోనా మూడవ స్థానాన్ని ఆక్రమించింది. అమెరికాలో కొవిడ్ 19 తీవ్రంగా ఉన్న మార్చిలో వైద్య నిపుణులు డాక్టర్ ఫౌసీ..దాదాపు లక్ష నుంచి రెండు లక్షల మంది మరణిస్తారని అంచనా వేశారు. ఆ తర్వాత 10 రోజులకు.. మరణాలు 60 వేల లోపే ఉండే అవకాశముందని ప్రకటించారు. కానీ ఇప్పుడు ఈ అంచనాలు కూడా మించిపోయాయి. చూడబోతే రెండో ప్రపంచ యుద్ధ మరణాల సంఖ్యను కూడా దాటేసేలా కనిపిస్తోంది.

మరికొన్ని రోజులు ఇలాగే ఉండే పరిస్థితులు మరింత దారుణంగా ఉండే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.

# ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు

### 2లక్షల 31వేలు దాటిన మరణాలు

### పదిలక్షలు దాటిన కోలుకుంటున్న వారి సంఖ్య

### రష్యా ప్రధానికి కూడా పాజిటివ్

న్యూఢిల్లీ,మే1(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ దేశాలు వైరస్‌తో విలవిల్లాడుతున్నాయి. ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా ఆర్థికంగా ఎంతో ప్రభావం

# దేశవ్యాప్తంగా మరో 1,718 పాజిటివ్ కేసులు

### కోలుకున్న 630 మంది బాధితులు
### లారీ డ్రైవర్లకు స్క్రీనింగ్ చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు

న్యూఢిల్లీ,మే 1(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో 1,718 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. దీంతో దేశంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 33,050కు చేరింది. కరోనా నుంచి కోలుకునే వారి సంఖ్య పెరిగిందని, గత 24 గంటల్లో 630 మంది బాధితులు కోలుకున్నారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ చెప్పారు. దేశంలో కరోనా రికవరీ రేటు 25 శాతం పైగానే ఉందన్నారు. కరోనా నుంచి ఇప్పటివరకు 8,324 మంది కోలుకున్నారని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు నమోదైన కరోనా మరణాల్లో 78 శాతం కరోనా మరణాల్లో ఇతర వ్యాధులు కూడా ఉన్నాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే పరీక్షలు చేయాలని, లారీ డ్రైవర్లకు స్క్రీనింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించామని చెప్పారు. లాక్‌డౌన్‌లో వలస కూలీలకు ఆహారం అందిస్తున్నామని, భౌతిక దూరం పాటించడంలో చాలావరకు అవగాహనకు వచ్చారని తెలిపారు. కరోనా ప్రభావం లేని చోట ఇప్పటికే చాలా సడలింపులు ఇచ్చామని వెల్లడించారు. కొన్ని రాష్ట్రాల్లో కరోనా కేసులు ఎక్కువగా వస్తున్నాయని ఆయన చెప్పారు. కరోనా ప్రభావం లేనిచోట్ల ఇప్పటికే చాలా సడలింపు ఇచ్చినట్లు కేంద్రం స్పష్టం చేసింది. కరోనా వల్ల మరణించిన వారిలో 78 శాతం మందికి ఇతర వ్యాధులు కూడా ఉన్నాయని లవ్ అగర్వాల్ ప్రకటించారు.

# హరితహారంతో సకాలంలో వర్షాలు

### ఆరేళ్లుగా కోట్లాది మొక్కలు నాటిన ఘనత ప్రభుత్వానిది
### ఎమ్మెల్యే రవిశంకర్

కరీంనగర్,మే 1 (నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంతో రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడుతున్నాయని ఎమ్మెల్యే రవిశంకర్ పేర్కొన్నారు. గత ఆరేళ్లుగా నిర్వహిస్తున్న హరితహారంలో కోట్లాది మొక్కలు నాటామని, నాటిన మొక్కలను సంరక్షించడంతోనే నేడు సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి అని పేర్కొన్నారు. వెదురుగట్టలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపక విధానం, ఎదుగుదలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో ఎదిగిన చెట్లను విచ్చలవిడిగా నరికి వేయడంతోనే ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయన్నారు. సకాలంలో వర్షాలు కురవక, ఆక్సిజన్ కూడా కొనుక్కునే దౌర్భాగ్య స్థితిని కొని తెచ్చిన ఘనత గత ప్రభుత్వాలు దక్కుతుందని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి వారంలోనే తెలంగాణను హరిత తెలంగాణగా మార్చాలనే దృఢ సంకల్పంతో హరితహారంను ప్రారంభించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుంది అని కొనియాడారు. జిల్లాల పునర్విభజన అనంతరం కరీంనగర్ జిల్లాలో అటవీ ప్రాంతాలుగా చెట్లను పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు వెదురుగట్టలో గత సంవత్సరం నిర్వహించిన హరితహారంలో 175 ఎకరాలలో 67,000 మొక్కలు నాటమని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నాటిన మొక్కలను నాటి వదిలేయకుండా వాటిని సంరక్షించడంతోనే ఈ ప్రాంతం అటవీ ప్రాంతంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీ ఆర్ ఆశయసాధనకు అనుగుణంగా మొక్కలను సంరక్షించిన అధికారులను ఆయన అభినందించారు. నియోజకవర్గంలోని వరద కాలువ, చెరువులు, తదితర ప్రాంతాలలో అటవీశాఖ అధికారులు సర్వే చేపట్టి మొక్కల పెంపకాన్ని చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామాలలో ఉన్న దేవాలయాల చుట్టూ వేప చెట్లు, తుమ్మ చెట్లు నాటించాలని అన్నారు. ఈ ఏడాది నిర్వహించే హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఆయాస, ఎఫ్ఆర్వో శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, ఎంపీపీ చిలుక రవి, సింగిల్ విండో చైర్మన్ వెల్ మల్లారెడ్డి, ఎఫ్ఎస్ఓ వేణు, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అజయ్ కుమార్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్,బిజెపి రాజకీయాలు

### ఇప్పటికే 21లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం
### మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి

కరీంనగర్,మే 1 (నేటినిజంప్రతినిధి): ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రతిపక్షాలు కాల్గేసుకుని వచ్చి కల్లాల్లో రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మండిపడ్డారు. 21 రోజుల్లో 21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, సగటున రోజుకు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొత్తపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి గంగుల కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాళేశ్వరం జలాలు, 24 గంటల కరెంట్ వల్లే పంట దిగుబడి పెరిగిందన్నారు. 3.5 లక్షల మంది రైతులు తమ పంటను ఇప్పటి వరకు అమ్ముకున్నారని చెప్పారు. భారీ ఎత్తున పంట దిగుబడి వచ్చి రైతులు సంతోషంగా ఉండటం కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఇష్టం లేదన్నారు. పంట దిగుబడి చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదన్నారు. నారు, నీరు పోయని కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మొద్దు.. నారు, నీరు పోసి ఆదుకుంటున్న కేసీఆర్‌ను మాత్రమే రైతులు నమ్మాలని మంత్రి సూచించారు. గుజరాత్, యూపీలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో.. రూ. 800లకే క్వింటాలు వడ్లు అమ్ముకుంటున్నారని తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ధాన్యం కొనుగోలు చేయడం లేదని మంత్రి గుర్తు చేశారు. కరోనా ప్రభావం రైతులపై పడకుండా ఉండేందుకు ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.

ఇంత పెద్ద ఎత్తున ఏనాడు పంట రాలేదని, కొనుగోళ్లు కూడా గతంలో ఎప్పుడు జరగలేదన్నారు. కాళేశ్వరం జలాలు, 24 గంటల కరెంట్ వల్లే పంట దిగుబడి పెరిగిందని పేర్కొన్నారు. సగటున రోజుకు లక్ష మెట్రిక్ టన్నులు కోనుగోలు చేస్తున్నామని తెలిపారు. 3.5 లక్షల మంది రైతులు ఇప్పటి వరకు తమ పంటను అమ్ముకున్నారని, రాష్ట్రంలో ఉన్న 6540 కోనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటికే 5789 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ జరుగుతుంటే కాంగ్రెస్, బీజేపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని, భారీ ఎత్తున పంట దిగుబడి వచ్చి రైతులు సంతోషంగా ఉండటం ప్రతిపక్ష పార్టీలకు ఇష్టం లేదని ధ్వజమెత్తారు. ఇంత పంట దిగుబడి చూసి ఓర్వలేకే ప్రతి పక్షాలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. రైతులు సాగునీటి కోసం, కరెంట్ కోసం ఇబ్బందులు పడినప్పుడు విమర్శులు చేస్తున్న నేతలంతా ఎక్కడికెళ్లారని, రైతులు పంటను కాల్చుతుంటే నవ్వుతున్న వాళ్లు ఇంతకాలం రైతుల కోసం ఎందుకు పోరాటం చేయలేదని మండిపడ్డారు. కాళేశ్వరం జలాలకు, 24 గంటల కరెంటుకు అడ్డుపడిన నేతలే ఇప్పుడు మళ్లీ రైతులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారన్నారు. నారు, నీరు పోయని కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలను తెలంగాణ రైతులు నమ్మొద్దని, నారు, నీరు పోసి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రైతులు నమ్మాలని సూచించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం కొనకపోతే రూ. 800లకు క్వింటా వడ్లు అమ్ముకుంటున్నారని, దేశంలో చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ధాన్యం కొనడం లేద చెప్పారు. ఏనాడు రైతుల గురించి ఆలోచించని నాయకులు కాల్గేసుకుని

వచ్చి కల్లాల్లో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఇక రైసు మిల్లులకు, రైతులకు సంబంధం లేదని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మాత్రమే రైతులు రావాలన్నారు. పాడీ క్లీనింగ్ చేసి తీసుకువచ్చిన తర్వాత కూడా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే మా దృష్టికి తీసుకురావాలని మంత్రి రైతులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారమే తాలు నిబంధనలు అమలు చేస్తుందని, బీజేపీ నేతలకు ఏ మాత్రమైన చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో దీక్ష చేసి తెలంగాణలోని రైతులకు ధాన్యం సేకరణ నిబంధనలు సడలించేలా చూడాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రోత్సాహంతోనే కొంతమంది రైతులు తూర్పార బట్టిన తాలును మాత్రమే తగలబెట్టారని పేర్కొన్నారు. దాదాపు 40 లక్షల ఎకరాలకి ఈసారి కోటీ 20 లక్షల ధాన్యం దిగుబడి వచ్చిందని చెప్పారు. ఇదంతా చూసి ప్రతిపక్షాలకు కళ్లు మండుతున్నాయని, మీ కళ్ల మంటలే మాకు దీవెనలు అని హితవు పలికారు. కరోనా ప్రభావం రైతులపై పడకుండా ఉండేందుకు ఊరుకో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొంటున్నామని వెల్లడించారు. సన్నరకం ధాన్యం పండించాలని సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని, ఈ విషయంలో రైతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి గంగుల కమలాకర్

# విస్టా ప్రాజెక్టుపై స్టేకు సుప్రీం నిరాకరణ

### కరోనా నేపథ్యంలో ఆపాలని పిటిషన్లు

న్యూఢిల్లీ,మే 1(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలోని ల్యుటెన్స్ జోన్‌లో రూ.20 వేల కోట్ల వ్యయంతో పార్లమెంటు నూతన భవనం, సెక్రెటేరియేట్, ఇతర నిర్మాణాలకు ఉద్దేశించిన సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూసేకరణను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే, జస్టిస్ అనిరుద్ధ బోస్ బెంచ్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టింది. ఈ ప్రాజెక్టుపై ఇదే తరహాలో దాఖలైన మరో పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉందని, ప్రస్తుత తరుణంలో దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని సీజేఐ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టును ప్రస్తుతానికైతే ఆపడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తెలిపింది. ఆ ప్రాజెక్టు కొరకు జారీ చేసిన భూవినియోగం మార్పు నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. మారుతున్న అవసరాలకు అనుగుణమైన నూతన పార్లమెంటు, మంత్రిత్వ శాఖలకు విశాలమైన కేంద్ర సెక్రటేరియట్, ప్రధాని, ఉపరాష్ట్రపతి కొరకు నూతన నివాస భవనాలు మొదలైనవాటితో కూడిన భారీ ప్రాజెక్టునే కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ విస్టా అని పిలుస్తున్నది. 2024లో పూర్తయ్యే ఈ విస్టా ప్రాజెక్టుకు కేంద్రం రూ.20,000 కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపును రద్దు చేసి కరోనా అవసరాలకు ఆ సొమ్మును మళ్లించాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రధాని నరేంద్రమోదీకి రాసిన ఓ లేఖలో విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు ప్రస్తుత భవనంలో సౌకర్యవంతంగా తన పనిని కొనసాగించవచ్చని, కొత్త భవనాల నిర్మాణం తక్షణ అవసరం ఏమీ కాదని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంత సొమ్ము ఖర్చు చేయడం దుబారా అవుతుందని సోనియా తన లేఖలో తెలిపారు. ఎంపీలాడ్స్ నిదులను నిలిపివేసి ఆ సొమ్మును కరోనాకు మళ్లిస్తున్న కేంద్రం మరోవైపు సెంటర్ల విస్టా ప్రాజెక్టుకు రూ.20,000 కోట్లు ఖర్చుపెట్టాలని చూస్తున్నదని తృణమూల్ ఎంపీ మహువా మోయిత్రా కూడా దుయ్యబట్టారు. అయితే ఈ ప్రాజెక్టులో భాగంగా ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ గత డిసెంబర్‌లో సౌత్ బ్లాక్ సమీపంలో డల్‌హౌసీ రోడ్డుపై ప్రధాని నూతన నివాసం నిర్మాణం కొరకు 15 ఎకరాల స్థలవినియోగాన్ని వినోద అవసరాల నుంచి నివాస అవసరాలకు మారుస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దేశం కరోనా కల్లోలం ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కేంద్రం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లడం భావ్యం కాదని విపక్షాలు అంటున్నాయి.

# ధాన్యంలో ఆరు కిలోల కోతా?: జీవన్ రెడ్డి

జగిత్యాల,మే 1(ఆర్ ఎన్ఎ):జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పర్యటించారు. కొనుగోళ్లు పూర్తయ్యాక రైతుకు ఏం సంబంధమని.. వారిని మిల్లర్ల దగ్గరకి ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు. క్వింటాకు ఆరు కిలోల కోత ఎలా చేస్తారని నిలదీశారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని.. మిల్లర్లతో అధికారులు కుమ్మక్కయ్యారని జీవన్‌రెడ్డి ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేసారు.

## రెడ్, ఆరెంజ్ జోనల్లో కట్టుదిట్టంగా కంటైన్మెంట్ విధానం

### మే 3వరకూ లాక్ డౌన్ పటిష్టంగా అమలు
### గ్రీన్ జోన్లలో పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభం
### వేగంగా కరోనా లక్షణాలున్న వారిని గుర్తించే పక్రియ : కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ

అమరావతి,మే 1(ఆర్ఎన్ఎ): రెడ్,ఆరెంజ్ జోనల్లో కంటైన్మెంట్ విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు.కరోనా నియంత్రణ చర్యలపై గురువారం ఢిల్లీ నుండి ఆయన వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గౌబ మాట్లాడుతూ ముఖ్యంగా కొవిడ్-19 పరిస్థితి మరియు కంటైన్మెంట్ ప్రణాళికల అమలు ఆధారంగా జిల్లాలను రెడ్, ఆరెంజ్, గ్రీన్ జిల్లాలుగా విభజన అజెండాగా ఈ వీడియో సమావేశం నిర్వహించారు.మే 3వరకూ లాక్ డౌన్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.వివిధ రాష్ట్రాల్లో్ చిక్కుకున్న వారిని స్వస్థలాలకు చేర్చేందుకు హోం శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తుఃచా తప్పక పాటించాలని సిఎస్ లను ఆదేశించారు. కరోనా అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించే పక్రియ విస్తృతంగా జరగాలని చెప్పారు.దేశవ్యాప్తంగా సరుకు రవాణా వాహనాలకు అనుమతించినందుకు వాటి విషయంలో ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కంటైన్మెంట్ జోన్లు లో లాక్ డౌన్ నిబంధనలను కట్టుదిట్టంగా

అమలు చేయాలని సిఎస్ లకు స్పష్టం చేశారు.అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని గ్రీన్ జోన్లు లో ఆర్థిక కార్యకలాపాలు పెద్ద ఎత్తున ప్రారంభం అయ్యేలా చూడాలని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ చెప్పారు.21 రోజుల వ్యవధిలో ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదు కాకుంటే ఆలాంటి జిల్లాను గ్రీన్ జిల్లాగా గుర్తించి ఆర్థిక కార్యకలాపాలు పూర్తి స్థాయిలో ప్రారంభం అయ్యేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు.అదే విధంగా నమోదవుతున్న పాజిటివ్ కేసుల సంఖ్య, పరీక్షల నిర్వహణ,కేసులు రెట్టింపు అవుతుండడం, సర్వే లెన్స్ పక్రియ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆరెంజ్,రెడ్ జిల్లాలుగా వర్గీకరణ చేయాల్సి ఉందని దానిపై రాష్ట్రాలు వివరాలు సూచనలు ఇవ్వాలని వాటిని బట్టి ఆరెంజ్,రెడ్ జిల్లాల విభజనపై మార్గదర్శకాల ను జారీ చేయడం జరుగుతుందని కేరాజీవ్ గౌబ పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశంలో ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రంలో 4 జిల్లాలు రెడ్ జిల్లా లుగాను,8 జిల్లాలు ఆరెంజ్ జిల్లాలు కేటగిరీ,ఒక జిల్లా గ్రీన్ జిల్లా కేటగిరీ కిందకు వస్తాయి యని వివరించారు.మే 3 వరకూ లాక్ డౌన్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సిఎస్ నీలం సాహ్ని కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబకు వివరించారు. ఈ వీడియో సమావేశంలో సిఆర్డిఏ అదనపు కమిషనర్ విజయకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశం జనసేన నేతలతో పవన్ సమీక్ష

### ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని హితవు
### ప్రజలకు ధైర్యం ఇవ్వాలన్న నాదెండ్ల

అమరావతి,మే 1(ఆర్ఎన్ఎ): ప్రకాశం జిల్లా జనసేన నాయకులతో పవన్ కల్యాణ్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇతర ముఖ్య నాయకులు రెచ్చగొట్టినా.. జన సైనికులు సంయమనంతో ప్రజా సేవే ప్రధానంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కోవిడ్ ఆసుపత్రులు... క్వారంటైన్ కేంద్రాల్లో సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. కరోనా మహమ్మారి అన్ని రంగాలపైనా ప్రభావం చూపిందన్నారు. ప్రజలకు భరోసా కల్పించే దిశగా పని చేస్తున్నప్పుడు ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, చర్యలకు పాల్పడ్డా సంయమనం వీడవద్దని పవన్ సూచించారు. ఇదిలావుంటే ప్రకాశం జిల్లాలో కేసుల సంఖ్య ఎక్కువగానే ఉందని జనసేన నేత నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రజలకు ఇలాంటి తరుణంలో మనో ధైర్యం ఇవ్వాలన్నారు. అలాంటి ధైర్యాన్ని ఏ మేరకు ప్రభుత్వం ఇస్తుందో అర్థం కావడం లేదని చెప్పారు. జనసేన నాయకులు, కార్యకర్తలు మారుమూల ప్రాంతాల్లో సైతం పేదలకు అవసరమైన నిత్యావసరాలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలో మిర్చి, కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసే రైతులు ఎన్నో ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. అలాగే పొగాకు వేలం వేసే సమయం ఇది. ఆ రైతులకు సమస్యలు వస్తున్నాయి. జిల్లాలోని రైతాంగం సమస్యపై పార్టీ నాయకులు దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచించారు. జిల్లా నుంచి వలసలు వెళ్ళినవారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. చేనేత కార్మికులు ఉపాధికి దూరమయ్యారని, వారికి ప్రభుత్వపరంగా సాయం సక్రమంగా అందుతుందో లేదో దృష్టిపెట్టాలని చెప్పారు.

## వసలకార్మికుల తరలింపునకు 345 బస్సులు

### ఇతరరాష్ట్రాల నుంచి కార్మికుల తరలింపునకు చర్యలు
### ప్రత్యేక ఫోన్ నంబరు కేటాయింపు: కృష్ణబాబు

విజయవాడ,మే 1(ఆర్ఎన్ఎ): వలస కార్మికుల తరలింపునకు 345 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కోవిడ్ స్టేట్ లెవల్ కోఆర్డినేటర్ కృష్ణబాబు తెలిపారు. ఏపీలోనే ఉండాలనుకొనే వలస కార్మికుల కోసం 402 రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. ఏపీ నుంచి 12 వేల మంది కార్మికులు వలస వెళ్లారని పేర్కొన్నారు. ఏపీ నుంచి వేరే రాష్ట్రానికికి వెళ్లే కార్మికుల కోసం 1902 నెంబర్‌కు బయటి రాష్ట్రాల్లో ఉన్నవారు ఏపీకి రావాలంటే 0866-2424680 నెంబర్ కాల్ చేయాలని సూచించారు. అంతేకాకుండా మెయిల్ చేయవచ్చని కృష్ణబాబు తెలిపారు. ఏపీకి వచ్చిన వలస కార్మికులను క్వారంటైన్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. గ్రీన్ జోన్‌లోని మున్సిపల్ ప్రాంతాలలో పరిశ్రమలకు, రూరల్ ఏరియా గ్రీన్‌జోన్లలో షాపులు తెరిచేందుకు అనుమతులిచ్చామని చెప్పారు. నగర ప్రాంతాల్లో కలెక్టర్, కమిషనర్‌లదే తుది నిర్ణయమన్నారు. థియేటర్స్, మాల్స్, విద్యాసంస్థలు తెరిచేందుకు అనుమతి లేదని కృష్ణబాబు స్పష్టం చేశారు. అగ్రికల్చర్, అగ్రో వ్యవస్థ గ్రీన్ జోన్ లో పూర్తిస్థాయిలో జరుగుతుందని కృష్ణబాబు తెలిపారు. గ్రీన్ జోన్ లోని మున్సిపల్ ప్రాంతాలలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తామన్నారు. వేరే ప్రాంతం నుంచి కూడా కార్మికులు వచ్చేందుకు అనుమతి ఇస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో లాక్ డౌన్ సమయంలో చిక్కుకుపోయిన వారిని తరలించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏపీకి వచ్చిన వారిని క్వారంటైన్ కు తరలించి వారిని ఇళ్లకు తరలించడం జరుగుతుందన్నారు. ఎంహెచ్ఏ గైడ్ లైన్స్ ప్రకారం మన రాష్ట్రం కూడా చర్యలు తీసుకుంటుందని, గ్రామీణ ఏరియాల్లో గ్రీన్ జోన్ లలో షాపులు కూడా తెరిచేందుకు అనుమతులు ఇస్తామన్నారు. నగర ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ , కమిషనర్ల నిర్ణయం ప్రకారం అనుమతులు ఉంటాయని చెప్పారు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిత్యావసరాల ధరలు నిర్ణయించడం జరుగుతుందన్నారు. గూడ్స్ కు సంబంధించి ఉదయం 7 నుంచి రాత్రి 7 వరకు అనుమతి ఉంటుందని కృష్ణబాబు చెప్పారు.

## మాంసం దుకాణాలపై నిషేధం

### -ఆదివారాలు షాపులకు అనుమతి లేదన్న మంత్రి

అమరావతి,మే 1(ఆర్ఎన్ఎ): ఆదివారం మాంసం అమ్మకాలపై పూర్తిగా నిషేధం విధిస్తున్నట్లు మంత్రి పేర్ని నాని ప్రకటించారు. మచిలీపట్నంలో అధికారులతో పేర్ని నాని సమీక్ష నిర్వహించారు. అధిక ధరలకు నిత్యావసర సరుకుల విక్రయంపై మంత్రి సీరియస్ అయ్యారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు అమ్మాలని ఆదేశించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకే నిత్యావసర సరుకుల అమ్మకాలు చేపట్టాలని పేర్ని నాని తెలిపారు. కరోనా కట్టడి కోసం ఏపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌ను అమలు చేస్తున్నారు. కానీ నిత్యావసరాల కోసం ఇచ్చిన వెసులుబాటును ప్రజలు పదే పదే దుర్వినియోగం చేస్తున్నారు. రోడ్ల మీదకు రాగానే అన్నీ మరిచి పోతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావద్దని, నిత్యావసర సరుకుల కోసం వచ్చినా.. సామాజిక దూరం పాటించాలని అధికారులు పదే పదే చెబుతున్నారు. అయినా ఇలాంటి నియమాలను గాలికి వదిలేస్తున్నారు. మరోవైపు మాంసం దుకాణాల వద్ద ఆదివారం కనిపిస్తున్న దృశ్యాలు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. చికెన్, మటన్, చేపలు అమ్మేచోట అంగుళం దూరం కూడా పాటించకుండా ఎగబడు తున్నారు. దుకాణ దారులు అమ్మకాలపైనే దృష్టి పెడుతున్నారే తప్ప... రద్దీ నియంత్రణ గురించి ఎవరూ పట్టించు కోలేదు. ఎగబడితే ప్రాణాంతక కరోనా సోకే ప్రమాదం ఉందని తెలిసినా.. జనం స్వీయ నియంత్రణ మరిచారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం మాంస అమ్మకాలపై ప్రభుత్వం నిషేదాన్ని విధించింది.

### కర్నూలులో వైఫల్యంపై కోట్ల లేఖ

కర్నూలు,మే 1(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ వైఫల్యం వల్లే కరోనా కేసులు పెరుగుతున్నాయని కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే జోక్యం చేసుకోవాలని కేంద్రానికి లేఖ రాశానని తెలిపారు. ఏపీలో లాక్‌డౌన్ సరిగ్గా అమలు కావడం లేదన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## రాష్ట్రంలో కొనసాగిన కేంద్రబృంద పర్యటన

### -కోటి మెటర్నిటీని సందర్శించిన సభ్యులు

హైదరాబాద్,మే 1(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, లాక్‌డౌన్ అమలు తీరును పరిశీలించడానికి గత కొన్ని రోజులుగా నగరంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం గురువారం కోఠి మెటర్నిటీ హాస్పిటల్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా అక్కడ చికిత్స కోసం వచ్చిన పేషంట్లతో మాట్లాడారు. లాక్‌డౌన్ నేపథ్యంలో అందిస్తున్న మెటర్నిటీ సేవల గురించి వైద్యాధికారులు, సిబ్బందిని వాకబు చేశారు. అనంతరం ఎల్బీనగర్‌జోన్‌లో ఉన్న ఉప్పల్ నైట్‌షెల్టర్‌ను, మార్కెట్‌ను సందర్శించారు. నిత్యావసరాల రవాణాకు ప్రభుత్వ పరంగా అందుతున్న సహకారం గురించి వాకబు చేశారు. అదే విధంగా చింతల్‌కుంట కంటైన్‌మెంట్ జోన్‌ను తనిఖీ చేశారు. ఇక్కడ కోవిడ్-19 నివారణకు చేపట్టిన చర

# పని కేంద్రాల్లో భౌతికి దూరం పాటించాలి

## ఉపాధి కూలీలకు మంత్రి ఎర్రబెల్లి సూచన

## పాలకుర్తిలో కూరగాయల వ్యాపారులతో మాటామంతీ

జనగామ,మే1(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి భౌతిక దూరం పాటించడం ఒక్కటే మార్గమని ఉపాధికూలీలకు మంత్రి ఎర్రబెల్లి

దయాకర్‌రావు సూచించారు. ఉపాధిహామీ కూలీలకు ఇచ్చే కూలీరేటు పెరుగుదలను గురించి తెలిపారు. ఉపాధి కూలీలకు వ్యవసాయ పనులకు అనుసం ధానం చేయాలని చేయాలని సీఎం కేసీఆర్, తాను కేంద్ర ప్రభుత్వానికి చెప్పినట్లు వెల్లడించారు. కష్టకాలంలో కరువు పనులు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. కూలీలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూ రు. లింగాలఘన్‌పూర్ మండలం కుందారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడా రు. పనులకు వెళుతున్న ఉపాధిహామీ కూలీలతో వారు చేస్తున్న పనులు, దొరుకుతున్న ఉపాధి, కరోనా పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలకూర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. పాలకూర్తి మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక కూరగాయాల మార్కెట్‌ను మంత్రి ఎర్రబెల్లి సందర్శించారు. కూరగాయల ధరలు అందుబాటులో ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూరగాయల వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. రైతులు, వ్యాపారులకు మాస్కులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక రైతు సేవా సహకారం సంస్థ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా ఏమైనా నష్టం జరిగిందా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన అఖరు గింజ వరకు కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు ఆందోళన చెంద వద్దని, భౌతిక దూరం పాటించి ధాన్యం అమ్మకం పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశా రు. రాయపర్తి మండలం కొలన్‌ప్లలె, మైలారం గ్రామాల్లో ఎర్రబెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కష్టకాలంలో పేదలను, ప్రజలను, రైతులను ఆదుకున్న వాళ్లే నిజమైన సేవకులు. దానం చేసేవాడే మనసున్న మహారాజు. సీఎం కేసీఆర్ ఆర్థిక సమస్యలను లెక్క చేయకుండా, పేదలను, రైతులను ఆదుకోవాలని నిర్ణయించారు. కేసీఆర్ ఔదార్యాన్ని ప్రజలు అందరూ అర్థం చేసుకోవాలి. ప్రజలు కూడా ఒకరికొకరు అదుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటిస్తూ లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న పేదలకు నిత్యవసరాలను పంపిణీ చేస్తున్నారు. రాయపర్తి మండలం మైలారం గ్రామంలో ఎస్ఆర్ఆర్ అధినేత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది నిరుపేద కుటుంబాలకు మంత్రి నిత్యావసర వస్తువులు అందజేశారు. అలాగే కోలన్‌పల్లిలో దాతల సహకారంతో నిరుపేదలకు మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు నిత్యవసరాలను పంపిణీ చేశారు.

## ప్రణాళిక లేకుండా లాక్‌డౌన్

### వలసకూలీల తరలింపుపై కాంగ్రెస్ విమర్శలు

న్యూఢిల్లీ,మే1(ఆర్ఎన్ఎ): వలస కార్మికుల తరలింపునకు లాక్‌డౌన్ ముగుస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం అనుమతించడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ప్రణాళిక లేకుండా లాక్‌డౌన్ ప్రకటించడంతో దేశవ్యాప్తంగా లక్షలాది వలస కార్మికులు చిక్కుకుపోయారని పేర్కొంది. పలు రాష్ట్రాల్లో చిక్కుకున్న వలస కార్మికులను వారి స్వస్థలాలకు రైళ్లలో తరలించడం మేలని కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి అన్నారు. వివిధ రాష్ట్రాల్లో లక్షలాది మంది వలస కూలీలు చిక్కుకుపోయారని వారిని బస్సుల్లో తరలిస్తే ఈ పక్రియ మూడేళ్లు పడుతుందని వ్యాఖ్యానించారు. లాక్‌డౌన్ విధించిన 40 రోజుల తర్వాత వలస కూలీల తరలింపునకు కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయడం తుగ్లక్ చర్యని ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం వలస కార్మికుల కోసం ఏం చేసిందని ఆయన నిలదీశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం రోజున కేంద్రం ప్రభుత్వం మాత్రం వారి సంక్షేమాన్ని విస్మరించి చేతులు దులుపుకున్నట్టుగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోనే 25 లక్షల మంది బిహారీ వలస కూలీలు చిక్కుకుపోయారని, రాజస్థాన్‌లో 2.5 లక్షల మంది, కేరళలో 4 లక్షల మంది, పంజాబ్‌లో 4 లక్షల మంది, ఒడిషా 7 లక్షలు, అసోంలో 1.5 లక్షల మంది వలస కూలీలు చిక్కుకుపోయారని వార్తలు వచ్చాయని సింఘ్వీ అన్నారు. వీరి తరలింపు బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు విడిచిపెట్టిందని, వాటికి ఎలాంటి నిధులూ విడుదల చేయలేదని విమర్శించారు.

## మేడేనాడు పారిశుద్ధ్య కార్మికులతో అల్పాహారం

### సిద్దిపేటలో పాల్గొన్న మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,మే1 (నేటినిజంప్రతినిధి): మేడేను పురస్కరించుకుని సిద్దిపేటలో మంత్రి హరీష్‌రావు పారిశుధ్య కార్మికులతో కలిసిఅల్పాహారం తీసుకున్నారు. ప్రపంచ మేడే దినోత్సవం సందర్భంగా సిద్ధిపేట కొండ మల్లయ్య గార్డెన్‌లో సిద్దిపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సన్మానం కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొన్నారు. వారితో కలిసి సహపంక్తి అల్పాహారం చేశారు. శేషాద్రి ఆస్పత్రి వారి సహకారంతో ప్లాస్కులు, ఎన్నారైల సహకారంతో మంత్రి పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు.

కార్మికులు అందిరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రపంచ కార్మిక ఐక్యతకు నిదర్శనం మే డే. ప్రతీ దేశం అభివృద్ధి వెనుక కార్మికుల శ్రమ దాగి ఉంది. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంలో కార్మికుల శ్రమను లెక్కిం చలేమని పేర్కొన్నారు. కార్మికులు రాత్రి, పగలు అని చూడకుండా 24 గంటలు కష్టపడితేనే మూడేండ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయగలిగామని వెల్లడించారు. సిద్దిపేటలో పారిశుద్ధ్య కార్మికులు మంత్రి సన్మానించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అల్పాహారం తిన్నారు.

మేడే దినోత్సవం సందర్భంగా సిద్ధిపేట కొండ మల్లయ్య గార్డెన్‌లో సిద్దిపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సన్మానం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

## నేటినుంచి రెండోవిడత బియ్యం పంపిణీ

### రాష్ట్రవ్యాప్తంగా 87.55 లక్షల కార్డుదారులకు లబ్ది

హైదరాబాద్, మే1(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నిర్మూలన కోసం ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో ఉపాధి కోల్పోయిన నిరుపేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత బియ్యం పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభించనుంది. గత నెలలో ఆహార భద్రత కార్డు ఉన్న కుటుంబంలో ఒక్కొక్కరికి 12కిలోల చొప్పున బియ్యం, ఒక్కోకార్డుపై 1500 రూపాయల ఆర్థికసాయం అందించింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 87.55 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్న కుటుంబంలో ఒక్కొక్కరికి 12కిలోల చొప్పున బియ్యం పంపిణీ ప్రారంభించనున్నారు. అలాగే నిజామాబాద్, నల్లగొండ, వరంగల్ రూరల్, మెదక్ జిల్లాల్లో ప్రతికార్డుదారుడికి కిలో కందిపప్పు కూడా ఉచితంగా పంపిణీ చేయబోతున్నట్టు పౌరసరఫరాలశాఖ అధికారులు వెల్లడించారు. నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక నెల రాష్ట్రానికి అవసరమైన 8,754 మెట్రిక్‌టన్నుల కందిపప్పు రావాల్సి ఉండగా , నాఫెడ్ ఇప్పటి వరకూ 3,233 మెట్రిక్‌టన్నులు మాత్రమే సరఫరా చేసింది. దీంతో ముందుగా మే1 నుంచి నాలుగు జిల్లాల్లో మాత్రమే సరఫరాచేస్తున్నట్టు తెలిపారు. నాఫెడ్ సరఫరా చేసే దానికి అనుగుణంగా రాష్ట్రంలోని మిగిలిన 29 జిల్లాల్లో 15వ తేదీ తర్వాత కందిపప్పు పంపిణీ చేస్తామని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే నెలకు సంబంధించి కూడా ప్రతి కార్డుదారుడికి 1500 రూపాయలు బ్యాంకులో లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాలో జమ చేసే కార్యక్రమాన్ని మే 2వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

## పెద్దపల్లిలో ఒకరు,జగిత్యాలలో ఇద్దరు మృతి

కరీంనగర్,మే1 (నేటినిజంప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం రచ్చపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అడ్రియాల్ ప్రాజెక్టు వద్ద ప్రమాదం జరిగింది. బోర్ వేస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి కిందపడి గోదావరిఖనికి చెందిన కే.స్వామి (34) అనే క్వాజువల్ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్వామిని మిగితా కార్మికులు సెంచసరీ కాలనీలోని డిస్పెన్సరీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. జగిత్యాల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులు కోరుట్లకు చెందిన గంగాధర్, రాజవ్వగా గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# వలస కార్మికులతో వెళ్లిన తొలి రైలు

## లింగంపల్లి స్టేషన్ నుంచి జార్ఖండ్‌కు పయనం

## నిర్మాణ కార్మికులను స్వస్థలాలకు తరలించిన తెలంగాణ సర్కార్

సంగారెడ్డి,మే1(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ వల్ల చిక్కుకుపోయిన వలస కార్మికులు ప్రత్యేక రైలులో వారి స్వస్థలాలకు తరలిఎళ్లారు. లాక్‌డౌన్ తర్వాత ఇలా కార్మికులను రైలులో తరలించడం ఇదే మొదటిసారి. సుమారు 1239 మంది వలస కార్మికులతో కూడిన ప్రత్యేక రైలు లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి జార్ఖండ్‌కు శుక్రవారం ఉదయం 4.50గంటలకు బయల్దేరింది. తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తితలో ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి రాష్ట్రంలో మార్చి 22న లాక్‌డౌన్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎక్కడి రైళ్లు అక్కడే నిలిచిపోయాయి. అయితే పోలీసులు, మిలటరీ, నిత్యావరన వస్తువుల తరలింపునకు ప్రత్యేక రైళ్లు నడపడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ంచింది. కాగా, ఇలా వలస కార్మికుల కోసమే ఏర్పాటు చేసిన మొదటి రైలు ఇది కావడం విశేషం. రాష్ట్రంలోని కంది మండలం ఐఐటీలో పనిచేస్తున్న జార్ఖండ్ వలస కార్మికులు ఈ ప్రత్యేక రైలులో వారి స్వస్థలాలకు తరలి వెళ్లారు. ఐఐటీ భవన నిర్మాణంలో జార్ఖండ్, పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశాలకు చెందిన 2,464 మంది కార్మికులు పనిచేస్తున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో తమను సొంత ప్రాంతాలకు వెళ్లనివ్వాలని గత రెండు రోజుల క్రితం ఆందోళన చేపట్టారు. దీంతో జార్ఖండ్‌కు చెందిన 1239 మంది కార్మికులను ప్రత్యేక రైలులో తరలించారు.

## లాక్‌డౌన్ నేపథ్యంలో వలస,దినసరి కార్మికులు, కడుబీదకుటుంబాలకు

# బాసటగా నిలిచేందుకు ముందుకువచ్చిన శాంతి,సక్షేమకమిటి సభ్యులు

### ఇప్పటి వరకు 3.15లక్షల విలువచేసే 630కిట్లు సిద్ధం

కరీంనగర్,మే 1 (నేటినిజంప్రతినిధి):లాక్‌డౌన్ అమలుతో ఉపాధికరువై ఇబ్బందులు పడుతున్న వలస,దినసరి కార్మికులు, కడుబీదకుటుంబాలకు చెందిన ప్రజలకు నిత్యావసరవస్తువులు,కూరగాయలు అందజేసేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాంతి,సంక్షేమ కమిటి సభ్యులు తమవంతు చేయూత నందించేందుకు ముందుకువచ్చారు. శుక్రవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు 3.15లక్షల విలువచేసే 630కిట్లను అందజేస్తామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి సమక్షంలో ప్రకటించారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాంతి,సంక్షేమ కమిటి సభ్యులు 3.15లక్షల రూపాయల విలువచేసే 630కిట్లను సిద్ధంచేశారు. మానవతాహృదయంతో ఏవరైనా ముందుకువచ్చి తమవంతు సహాకారాన్ని అందించేందుకు శనివారం సాయంత్రం వరకు సమయం ఇచ్చారు. ఒక్కోకిట్‌లో 05కిలోల బియ్యం, ఒకకిలో పప్పు, ఒకకిలో వంటనూనె, ఒకకిలో ఉల్లిగడ్డలు, రెండుకిలోల ఆలుగడ్డలు, ఒకకిలో చక్కెర, పావుకిలో ఛాయపత్తిలు ఉంటాయి. వీటితో పాటు గోపాలపురం గ్రామానికి చెందిన రైతు మంద రాజమౌళి తమవంతుగా 10క్వింటాళ్ళ కూరగాయలను ఉచితంగా అందజేసేందుకు ముందుకువచ్చారు. వండించిన వంటను అమ్మడంతోపాటు వలస,దినసరికార్మికులు, కడుబీదకుటుంబాలకు ఉచితంగా కూరగాయలను అందించేందుకు ముందుకు వచ్చిన రైతు రాజమౌళిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి కొంతమొత్తాన్ని వ్యక్తిగతంగా అందజేశారు.

ఈసందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలానన్‌రెడ్డి మాట్లాడుతూ కుల,మతవర్గవిభేదాలకు అతీతంగా అన్నివర్గాలకు చెందిన కార్మికులు, కడుబీదకుంటుంబాలకు ఈ కిట్‌లను అందజేస్తామన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆర్థికపరిస్థితులు మందగించిన దృష్ట్యా దీర్ఘకాలంగా పైన పేర్కొన్న కుటుంబాలకు తమవంతు సహాయంగా కార్యక్రమాలను కొనసాగించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మున్సిపల్ అధికారుల సహకారంతో పైనపేర్కొన్న కుటుంబాలను గుర్తించనున్నారు. సోమవారంనాడు గ్రామీణప్రాంతాల్లో ఈ కిట్ల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. శాంతి,సంక్షేమకమిటి సభ్యులు కార్మికులు, కడుబీదకుటుంబాలకు బాసటగా నిలించేందుకు ముందుకువచ్చి తమ ఐక్యతను చాటడం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నారు. మానవతాహృదయంతో ముందుకువచ్చి సహాయంఅందించేవారు ఒకకిట్‌కు 500రూపాయల చొప్పున గూగుల్‌పే, ఫోన్‌పే, పేటియంల ద్వారా 9966551111 నెంబర్‌కు పంపించవచ్చని తెలిపారు. శనివారం సాయంత్రంలోపు మాత్రమే ఈ అవకాశం ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (పరిపాలన) జి చంద్రమోహన్, ట్రైనీ ఐపిఎస్ అధికారిణి నిటికపంత్, ఏసిపి పి అశోక్, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, దేవారెడ్డి, విజ్ఞాన్‌రావు, తుల శ్రీనివాస్‌లతోపాటుగా శాంతి,సంక్షేమకమిటి సభ్యులు రమేష్‌రెడ్డి,జనార్ధన్‌రెడ్డి, మహమూద్, ఘన్‌శ్యామ్‌ఓజా, ఏంఏ రఫీక్, గఫార్, నిరంజనాచారి, మాజీ డిప్యూటి మేయర్ అబ్బాస్‌లతోపాటు పోలీసు అధికారులు, శాంతి,సంక్షేమకమిటి సభ్యులు పాల్గొన్నారు.

## బెంగాల్లో భారీగా పోలీస్ అధికారుల బదిలీ

కోల్‌కతా,మే1(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ క్రమంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 40 మంది పోలీసు ఉన్నతాధికారులకు స్థానచలనం కల్పిస్తూ అదేశాలు జారీ చేసారు. . ప్రజా ప్రయోజనాల కోసమే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు పశ్చిమ బెంగాల్ పోలీస్ డైరెక్టరేట్ నిన్న వెలువరించిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

అయితే లాక్‌డౌన్ సమయంలో మమతా ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. బదిలీ అయిన అధికారుల జాబితాలో పశ్చిమ బెంగాల్ టెలీకాం డిప్యూటీ ఎస్పీ, బారాక్‌పూర్ ట్రాఫిక్ ఏసీపీ, బరుయ్‌పూర్ పీడీ డిప్యూటీ ఎస్పీ (క్రైం), జల్పైగురి డీఈబీ డిప్యూటీ ఎస్పీ, పశ్చిమ బెంగాల్ సీఐడీ డిప్యూటీ ఎస్పీ, డార్జిలింగ్ (యూటీ) డిప్యూటీ ఎస్పీ నహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారు.

## వలస కార్మికులకు యడ్యూరప్ప విజ్ఞప్తి

బెంగళూర్, మే1: వలస కూలీల తరలింపుకు కేంద్ర గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో..పలు రాష్ట్రాల్లో ఉన్నవాళ్లు సొంత రాష్ట్రాలకు తరలివెళిపోతున్నారు. ఇప్పటికే పలు రైళ్లలో తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే కర్ణాటక ముఖ్యమంత్రి మాత్రం అందుకు భిన్నంగా స్పందించారు. తమ రాష్ట్రం నుంచి ఏ ఒక్క వలస కూలీలు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. వలస కార్మికులు అందరూ దయచేసి తమ రాష్ట్రంలోనే ఉండాలని కోరారు. వలస కార్మికులు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే రాష్ట్రం ఆర్థికంగా మందింతకుంగిపోతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలోనే ఉండి ఆర్థికంగా ఎదగడానికి తమ వంతు సహాకారం అందించాలన్నారు. కాగా ఇప్పటికే మే 4 నుంచి కంటైన్మెంట్ జోన్లు మినహా ఆర్థిక కార్యాకలాపాలకు అనుమతిస్తున్నట్లు కర్ణాటక ప్రభుత్వం తెలిపింది.

## వందశాతం రిజర్వేషన్ల ఉత్తర్వును కొట్టివేయడంపై రివ్యూ పిటిషన్

హైదరాబాద్, మే1: ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ నియామకాల్లో గిరిజనులకు వందశాతం రిజర్వేషన్లు కల్పించే ఉత్తర్వును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సత్యవతి రాథోడ్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. గిరిజనులకు వందశాతం రిజర్వేషన్ల ఉత్తర్వును సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేయడంపై భేటీలో మంత్రి చర్చించారు. సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని సీఎం సైతం నిర్ణయించారన్నారు. పక్కా ప్రణాళికతో కసరత్తు చేసి త్వరలోనే పిటిషన్ వేస్తామన్నారు. న్యాయనిపుణులు, గిరిజన పెద్దల సలహాతో పిటిషన్ తయారుచేయనున్నట్లు తెలిపారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, గిరిజనుల హక్కుల రక్షణకు సహకరించాలని కేంద్రాన్ని కూడా కోరినట్లు మంత్రి పేర్కొన్నారు.

## అనంతపురం నుంచి రాజస్థాన్‌కు వలస కూలీలు

అనంతపురం,మే1(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రం నుంచి రాజస్థాన్‌కు వలస కూలీలను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో రాజస్థాన్‌కు చెందిన వారు అనంతపురం జిల్లాలోనే నిలిచిపోయారు. ప్రస్తుతం వలస కూలీలను తమ స్వస్థలాలకు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వారంతా సొంత ప్రాంతాలకు పయనమయ్యారు. నగరంలోని రఘువీర్ టవర్స్ వద్ద ప్రత్యేక బస్సుల్లో వారిని కలెక్టర్ గంధం చంద్రుడు, ఎమ్మెల్యే అనంత వెంకట రామిరెడ్డి సాగనంపారు.

## కరోనా నివారణ చర్యలపై సీఎం జగన్ సమీక్ష

తాడేపల్లి, మే1: కరోనా నియంత్రణ చర్యలపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి కన్నబాబు, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, హెల్త్ స్పెషల్ సీఎస్ జవహర్‌రెడ్డి హాజరయ్యారు. క్వారంటైన్ కేంద్రాలను నిరంతరం పరిశీలన చేయాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. టెలీమెడిసిన్, విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. టెలీమెడిసిన్ ద్వారా ప్రిస్క్రిప్షన్ పొందడం, అక్కడ నుంచి నేరుగా విలేజ్ క్లినిక్ ద్వారా మందులు సరఫరా చేయాలని జగన్ పేర్కొన్నారు. ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలకు ఇంటర్నెట్, విద్యుత్ సహా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

## సొంతూళ్లకు బయలుదేరుతున్న కార్మికులు

కరీంనగర్,మే1 (నేటినిజంప్రతినిధి):: వలస కూలీలు వారి స్వగ్రామానికి వెళ్లేందుకు కేంద్రం అనుమతించడం తో పెద్ద సంఖ్యలో వీరు తమ స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో రహదారులపై ఎక్కడ చూసినా వలస కూలీలే కనిపిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో భారీ సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. అనేక చోట్ల వాహన సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. మహారాష్ట్ర నుంచి సొంతూళ్లకు బయలుదేరిన కార్మికులను మధ్యప్రదేశ్ బోర్డరు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారిని రాష్ట్రంలోకి అనుమతించలేదు. దాంతో వారంతా అక్కడే నిలిచిపోయారు. పలు రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చిన కూలీలు వారి సొంతూళ్లకు కాలినడకన బయలుదేరారు. వాహనాలు అందుబాటులోలేకపోవడంతో కాలినడకన కరీంనగర్ జిల్లా రాయపట్నం చెక్ పోస్టు వద్దకు వెయ్యిమందికిపైగా చేరుకున్నారు---------

# పారిశుద్ధ్య కార్మికులకు సలాం.. మంత్రి అల్లోల

నిర్మల్, మే1: కరోనా నియంత్రణకు వైద్యులు, పోలీసులతోపాటు పారిశుద్ధ్యకార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని, వారి సేవలకు సలాం చేస్తున్నాని దేవాదాయ శాఖ మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నిర్మల్ పట్టణంలో లాక్‌డౌన్ అమలును పరిశీలించారు. పేదలు, వలస కార్మికుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం తరపున సాయం చేస్తామని హామీ ఇచ్చారు. కరోనా నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలకుగాను వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం వారితో కలసి భోజనం చేశారు. లాక్‌డౌన్ సమయంలో పగలు, రాత్రి తేడాలేకుండా పట్టణాన్ని పారిశుద్ధ్యకార్మికులు పరిశుభ్రంగా ఉంచుతున్నారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో పనిచేస్తున్నందుకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని చెప్పారు.

## తదక్షణ కొరియా చర్యలు ఆదర్శం:అంటోనియో గుటెర్రెస్

జెనీవా,మే1(ఆర్ఎన్ఎ):కోవిడ్-19 వైరస్‌పై పోరులు ప్రపంచదేశాలు దక్షిణ కొరియాను ఆదర్శంగా తీసుకోవాలని ఐక్యరాజ్యసమితి కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ పిలుపునిచ్చారు. కోవిడ్ వైరస్‌ను దక్షిణ కొరియా విజయవంతంగా నియంత్రించింది. గత రెండుమూడు వారాలుగా ఒక్క కొత్తకేసు కూడా నమోదు కాలేదు. కరోనా సంక్షోభం నుంచి దేశాన్ని ఆర్థికంగా బయటపడేసేందుకు గొప్ప హరిత లక్ష్యాన్ని చేపట్టిందని గుటెర్రెస్ తెలిపారు. ఇందులో భాగంగా దక్షిణ కొరియాలో బొగ్గు ఆధారిత పరిశ్రమలన్నీ మూసేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దేశంలో 10,765 కరోనా కేసులు నమోదు కాగా 247 మంది మరణించారు. గురువారం నాలుగు కరోనా కేసులు నమోదైనప్పటికీ వారిలో కొరియావాసులు ఎవరూ లేరని ఆ దేశ వ్యాధి నియంత్రణ సంస్థ ప్రకటించింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.